నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

గురువారం | 03.07.2025 | సంపుటి : 3 | సంచిక :67 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




మిడిల్‌క్లాస్‌కు త్వరలో మరో ఊరట
08


04

మేడారం సమ్మక్క జాతర
## తేదీలు ఖరారు
జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల జాతర



## ఇంటర్ వరకు
# డ్రాపౌట్లు ఉండొద్దు
## నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

- 9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి
- 'ఇంటర్'పై అసెంబ్లీలోనూ చర్చిద్దాం
- చాకలి ఐలమ్మ వర్సిటీ నిర్మాణ టెండర్లు త్వరగా ఖరారు
- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు.

హైదరాబాద్, జూలై 2 : రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు మరొకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే తొలుత ప్రకటించిన పాఠశాలలకు సంబంధించిన స్థలాల సేకరణ పూర్తయినందున, ఇకపై రెండో విడత పాఠశాలలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన 105 నియోజకవర్గాల్లో ఒక్కో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూ వచ్చింది. తాజాగా నియోజకవర్గానికి రెండు చొప్పున నిర్మిస్తామని సీఎం వెల్లడించడం గమనార్హం. సమీక్ష సందర్భంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నమూనాలను, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ భవనం నమూనాను ఆయన పరిశీలించి కొన్ని మార్పులను సూచించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... "ప్రతి యంగ్ ఇండియా పాఠశాలలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలి. పాఠశాలల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి.

మిగతా 2 లో



చేనేత కార్మికుల
## రుణమాఫీకి 33 కోట్లు
- 5691 మంది చేనేత కార్మికులకు లబ్ది
- పరిపాలన అనుమతులు జారీచేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడి

03

శాంతియుత ప్రపంచమే
# భారత్ ఆకాంక్ష
17వ 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుపై భారత ప్రధాని మోదీ
ప్రధాని వారం రోజుల విదేశీ పర్యటన ప్రారంభం
ఘనా రాజధాని అక్రాలో ఘన స్వాగతం



**దిల్లీ:** బ్రెజిల్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న 17వ 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుపై భారత ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతియుతమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని భారత్ ఆకాంక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యానికి కట్టుబడి ఉంటామన్నారు. వ్యవస్థాపక దేశం హెూదాలో ఆ కూటమి బలోపేతానికి అన్ని చర్యలను చేపడతామని మోదీ వెల్లడించారు. ఈ సదస్సు సందర్భంగా రియో డి జనీరోలో వివిధ దేశాల ప్రభుత్వాధినేతలతో ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తానన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వాతో జరిగే సమావేశంలో వర్ధమాన దేశాల బలోపేతంపై ముఖ్య చర్చ జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటన కోసం బుధవారం ఉదయం దిల్లీ నుంచి బయల్దేరారు. తొలుత ఘనా రాజధాని అక్రా చేరుకున్న భారత ప్రధానికి అరుదైన స్వాగతం లభించింది. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహమ స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీని ఆత్మీయంగా స్వాగతించడం విశేషం. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహమతో ప్రధాని భేటీ అనంతరం 2 దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరాయి. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని విస్తృత స్థాయి భాగస్వామ్యంగా మార్చాలని ప్రధాని మోదీ తెలిపారు.

ఈ నెల 14 నుంచి
# కొత్త రేషన్ కార్డులు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను అతి త్వరలో ప్రారంభిస్తాం: ఉత్తమ్
- ఎరువుల కొరత రానీయొద్దు: అడ్లూరి
- జిల్లా కేంద్రాలకు డబుల్‌రోడ్లు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

02



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈ నెల 14న జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ తరుణంలో అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ నెల 13లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాలు రూపొందించాలని ఆదేశించారు.



బయట వారికి సద్దులు కడుతూ..
## కేసీఆర్‌పై నిందలు
- బనకచర్లపై దుష్ప్రచారాలు ఆపండి
- అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా?
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్

03

రెండేళ్లలో 2 లక్షల మంది
# ఏఐ నిపుణులు
- తెలంగాణ యువతను తీర్చిదిద్దడమే లక్ష్యం
- త్వరలో ఏఐ వర్సిటీ ప్రారంభం
- 'టీజీడెక్స్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** రెండేళ్లలో 2 లక్షల మంది తెలంగాణ యువతను ఏఐ (కృత్రిమ మేధ) రంగ నిపుణులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ దిశగా అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే ఏఐ యూనివర్సిటీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నెలకొల్పిన.. దేశంలోనే తొలి ఏఐ అనుసంధానిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ (టీజీడెక్స్)'ను బుధవారం హైదరాబాద్‌లోని 'టీ హబ్'లో మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏఐ ఎమర్జింగ్ టెక్నాలజీ మాత్రమే కాదు.. మానవ జీవితాలను ప్రభావితంచేసే గొప్పశక్తి. కొత్తగా ఎన్నో అవకాశాలను సృష్టించింది.

మిగతా 2 లో


03

మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర
- మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్‌ల రాక
- మంత్రిని నిలదీసిన బాధిత కుటుంబాలు

మృతుల కుటుంబాలకు
# కోటి పరిహారం
- అన్ని బీమా క్లెయిమ్‌లు అందిస్తాం
- క్షతగాత్రుల వైద్య ఖర్చుల బాధ్యత మాదే
- ప్రమాదంలో 40 మంది మృతి 33మందికి గాయాలు
- ప్రభుత్వ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాం
- కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటన

03



డిమాండ్‌కు అనుగుణంగా
# పంటలకు ప్రోత్సాహం ఏదీ?
- వ్యవసాయాను బంధ రంగాలకు దక్కని ఊరట
- నిపుణుల సలహాలు పట్టించుకోని పాలకులు


04

## ఇంటర్ వరకు డ్రాపౌట్లు ఉండొద్దు

(మొదటిపేజీ తరువాయి)



పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణులవుతున్నా... ఇంటర్ పూర్తయ్యేసరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. కారణాలు, సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి. ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్ దశ కీలకమైంది. ఆ సమయంలో వారికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరముంది. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంటర్ పూర్తి చేసేలా చూడాలి. చేరికలతోపాటు వారి హాజరుపైనా దృష్టి సారించాలి. ఇంటర్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడదాం" అని సూచించారు. ఇతర రాష్ట్రాల్లోని పాఠశాలల్లో 12వ తరగతి వరకు విద్య అందుతోందని, అందుకే అక్కడ డ్రాపౌట్లు తక్కువని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఈ క్రమంలో 12వ తరగతి వరకు పాఠశాలలున్న రాష్ట్రాలు, ఇంటర్మీడియట్ వేరుగా ఉన్న రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు, తెలంగాణ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 14 నుంచి
# కొత్త రేషన్ కార్డులు



**నల్లగొండ, జూలై 2 :** సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈ నెల 14న జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ తరుణంలో అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ నెల 13లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాలు రూపొందించాలని ఆదేశించారు. బుధవారం నల్లగొండలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ప్రారంభిస్తారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం వద్ద హెలికాప్టర్ ద్వారా ఎలక్ట్రో మ్యాగ్నటిక్ రాడార్ సర్వే నిర్వహించి, నివేదిక ఆధారంగా టన్నెల్ పనులు అతిత్వరలో పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. టన్నెల్స్ నిర్మాణానికి అత్యంత అనుభవజ్ఞులైన జనరల్ హర్పాల్ సింగ్‌ను నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారుగా, ప్రపంచ టన్నెల్ నిపుణుడు జనరల్ పరీక్షిత్ బెహరాను ఇరిగేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించబోతున్నట్లు చెప్పారు. వారి నేతృత్వంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. వానాకాలం సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువుల ఇబ్బందుల్లేకుండా చూడాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు ఉన్న రోడ్లను రూ.12 వేల కోట్లతో డబుల్ లైన్ రోడ్లుగా మార్చనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వీటన్నింటినీ హామ్ పద్ధతిలో చేపడతారని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం ఇదేరీతిలో చేపడుతున్నామన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ పరిశ్రమను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.700 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో 2 వేల మందికి పైగానే ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## రెండేళ్లలో 2 లక్షల మంది
# ఏఐ నిపుణులు

(మొదటిపేజీ తరువాయి)



ఈ మార్పును అందిపుచ్చుకుని తెలంగాణను 'గ్లోబల్ క్యాపిటల్ ఆఫ్ ఏఐ'గా తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే 'ఏఐ స్ట్రాటజీ అండ్ రోడ్‌మ్యాప్'ను రూపొందించింది. ఏఐని ప్రజలంతా సమర్థంగా వినియోగించుకునేలా.. అనేక సమస్యలకు పరిష్కారం చూపించేలా.. 'టీజీడెక్స్' పేరిట డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను జైకా సహకారంతో అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని రూపకల్పనలో బెంగళూరు ఐఐఎస్‌సీ వ్యూహాత్మక సహకారం అందించింది. ఇది దేశంలో మొట్టమొదటి ఏఐ డేటా ఎక్స్ఛేంజ్. కేవలం డేటా ప్లాట్‌ఫామ్ మాత్రమే కాదు. ప్రభుత్వశాఖలు, స్టార్టప్స్, విద్యాసంస్థలు, పరిశోధకులు, యువత.. అంతా ఒకే వేదికపైకి వచ్చి ఎన్నో సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు దారి చూపుతుంది. ఇప్పటికే 480కి పైగా డేటాసెట్స్, 3 వేలకుపైగా ఏఐ స్టార్టప్స్ ఇందులో భాగస్వామ్యమయ్యాయి. 'టీజీడెక్స్' ద్వారా రైతులకు మేలుచేసే అగ్రిటెక్ స్టార్టప్స్‌నకు డేటా లభిస్తుంది. రోగులకు మరింత సమర్థంగా సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖకు అవసరమైన ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయొచ్చు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఉపయోగపడుతుంది. 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణను తీర్చిదిద్దేలా నూతన ఆవిష్కరణలకు దిక్సూచిగా మారుతుంది. 'టీజీడెక్స్'లో రాబోయే ఐదేళ్లలో 2 వేల డేటాసెట్స్‌ను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే ప్రభుత్వ ఆధ్వర్యంలో 30 ఏఐ ఆధారిత ప్రాజెక్టులను అమలు చేస్తున్నాం. త్వరలోనే 'క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పాఠశాలస్థాయి నుంచే నిపుణులను తయారుచేసేలా 'ఏఐ ఆధారిత అకడమిక్ కరిక్యులమ్'ను రూపొందించాం" అని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్, ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీహబ్ సీఈవో కవికృత్, టీవర్క్ సీఈవో జోగిందర్, జైకా ప్రతినిధులు టాకూచీ రాకూరో, యుషి నగానో తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు రేషన్ భరోసా

- కొత్తగా 2.4 లక్షల కార్డులు రాష్ట్రవ్యాప్తంగా 11.30 లక్షల మందికి లబ్ధి
- 14న తుంగతుర్తి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సభ
- సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు రేషన్‌కార్డు పత్రాలు
- నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ..



**హైదరాబాద్:** పేదలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా కొత్త రేషన్ కార్డుల్ని మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 4.76 లక్షల దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 11.30 లక్షల మంది పేదలకు ప్రయోజనం కలగనుంది. లక్షల మందికి రేషన్ లబ్ధి కలగనున్న నేపథ్యంలో ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సర్కారు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కొద్దిరోజుల క్రితం కలిసిన స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుకు ఈ సమాచారం అందడంతో ఏర్పాట్లపై ఆయన దృష్టి సారించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో సీఎం కార్యక్రమానికి ఈ నెల 14వ తేదీని ఖరారు చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆ రోజు వెయ్యి మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డుల్ని పత్రాల రూపంలో అందించనున్నట్లు తెలిసింది. కొత్త రేషన్‌కార్డుల పంపిణీని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా నిర్వహించేలా కార్యాచరణను ప్రభుత్వం రూపొందించింది. తాజాగా ఆమోదించిన కొత్త లబ్ధిదారుల గణాంకాల్ని పౌరసరఫరాల శాఖ సీఎం కార్యాలయానికి పంపించింది.

### కొత్త సభ్యుల జోడింపు..

కొత్త రేషన్‌కార్డుల మంజూరుతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులనూ జోడించారు. అటు కొత్త కార్డులు, ఇటు పాత కార్డుల్లో జోడింపుతో పేద కుటుంబాల సభ్యులు భారీ సంఖ్యలో రేషన్ పథకంలో లబ్ధిదారులయ్యారు.

### డైనమిక్ కీ రిజిస్టర్‌లోకి..

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్ని పౌరసరఫరాల శాఖ దశలవారీగా పరిశీలించి ఆమోదిస్తోంది. కలెక్టర్లు.. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆమోదించిన దరఖాస్తులను డైనమిక్ కీ రిజిస్టర్(డీకేఆర్)లో నమోదు చేశాక అందులోని సభ్యులు రేషన్ పథకంలో లబ్ధిదారులవుతారు. 14వ తేదీన సీఎం సభకు ముందు 4.76 లక్షల దరఖాస్తుల్ని అందులోని 11.30 లక్షల మంది లబ్ధిదారుల్ని డీకేఆర్‌లో నమోదుచేసి యాక్టివేట్ చేయనున్నట్లు సమాచారం. క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డుల్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా.. టెండర్ల ప్రక్రియలో ఓ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో ప్రస్తుతానికి పేపర్ రూపంలోనే రేషన్‌కార్డు ఇవ్వనున్నారు.

## తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

### వారికి నల్లా, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలి
### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్

**హైదరాబాద్, జులై 2 :** ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే అని విమర్శించారు. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండని విజ్ఞప్తి చేశారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. 'బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యేగా ఒక సూచన చేస్తున్నా. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండి. ఇరిగేషన్ ప్రాజెక్టు పైసలు ఒక్క రూపాయి ఇవ్వకండి. వాళ్లే చంద్రబాబు వద్దకు వెళ్లి కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ పెట్టిస్తారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు' అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## దిల్లీలో ఘనంగా ముగిసిన లాల్‌దర్వాజ బోనాలు



**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో గత మూడు రోజులుగా కొనసాగిన లాల్‌దర్వాజ బోనాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు ఉత్సవాల్లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లు ప్రత్యేక అతిథులుగా పాల్గొని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ "బోనాలు, బతుకమ్మ పండగలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు. లాల్‌దర్వాజ కమిటీ సభ్యులు ఆ సంస్కృతిని దిల్లీ వరకు తీసుకొచ్చి తెలంగాణ ప్రతీకను సజీవంగా నిలబెడుతుండడం అభినందనీయం" అని పేర్కొన్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 11 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా దిల్లీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారంటూ లాల్‌దర్వాజ కమిటీని అభినందించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం పాడిపంటలతో తులతూగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలో కొత్తగా నిర్మించబోయే తెలంగాణ భవన్ ప్రాంగణంలో మహంకాళి అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని లాల్‌దర్వాజ బోనాల కమిటీ ప్రతినిధులు కోరారు. బోనాల పండగ ముగింపు సందర్భంగా తెలంగాణ భవన్‌లోని ఆడిటోరియంలో సుమారు 150 మంది రాష్ట్ర కళాకారులు జానపద కళలను ప్రదర్శించారు.

## గ్రూప్-1 మూల్యాంకనాన్ని పారదర్శకంగా నిర్వహించాం

### హైకోర్టుకు నివేదించిన టీజీపీఎస్సీ




**హైదరాబాద్:** గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం పారదర్శకంగా జరిగిందంటూ టీజీపీఎస్సీ బుధవారం హైకోర్టుకు నివేదించింది. అభ్యర్థుల ప్రయోజనాల పరిరక్షణకు అన్ని చర్యలను కట్టుదిట్టంగా చేపట్టామంది. గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పలు పిటిషన్‌లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారమూ విచారణ కొనసాగించారు. కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ "మూల్యాంకనం మూడు దశల్లో జరిగింది. అంతేగానీ పునర్ మూల్యాంకనం జరగలేదు. మొదట ప్రొఫెసర్ మూల్యాంకం చేశాక... రెండో మూల్యాంకనం జరుగుతుంది. రెండింటి మధ్య వ్యత్యాసం 15 శాతానికి మించితేనే మూడో వ్యక్తి మూల్యాకనం చేస్తారు. లేదంటే... రెండు మూల్యాంకనాల సగటును మార్కులుగా కేటాయిస్తారు. అంతేగాకుండా మొదటి మూల్యాంకనంలో ఎన్ని మార్కులు వచ్చాయన్న విషయం రెండోసారి చేసేవారికి తెలియదు. ఎవరి పేపర్లను మూల్యాంకనం చేస్తున్నారన్న వివరాలూ వారికి తెలియవు. కేవలం బార్ కోడ్ మాత్రమే ఉంటుంది. మూల్యాంకనం అనంతరం బార్ కోడ్ ద్వారా ఏ అభ్యర్థికి ఎన్ని మార్కులు వచ్చాయన్నది కమిషన్ వెల్లడిస్తుంది. మూల్యాంకనం చేసేవారిలో కొందరు కఠినంగా, మరికొందరు కొంత సరళంగా వ్యవహరించవచ్చు. ఈ కారణంగా అభ్యర్థులు నష్టపోకూడదనే ఇలా మూడు దశల్లో మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకనం ఎలా జరుగుతుందన్న విధానం నిబంధనల్లో లేకపోయినంత మాత్రాన అది చెల్లకుండా పోదు" అని వివరించారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... తెలుగులో 8 వేల మంది దాకా పరీక్షలు రాస్తే 60 మంది కూడా ఉత్తీర్ణులు కాలేదన్నారు. తెలుగురాని, అర్హతలేని వారు మూల్యాంకనం చేయడంతోనే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. కమిషన్ వాదనలు గురువారమూ కొనసాగనున్నాయి.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, జులై 2 :** అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. పేదల ఆకలి తీర్చడం, బడుగు బలహీన వర్గాల అవసరాలను తీర్చడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యమని అన్నారు. ప్రతి బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించామని చెప్పారు.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అధికంగా ధరణి బాధితుల సమస్యలే ఉన్నాయని చెప్పారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వమంతా కృషి చేస్తోందని తెలిపారు. ఓ పేదవాడు నేరుగా మంత్రిని కలిసి సమస్య వినిపించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్న సంగతి ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే, బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో హరీష్ రావు తడబడినట్లు స్పష్టంగా అర్థమవుతోందని శ్రీహరి పేర్కొన్నారు. 100 టీఎంసీల నీరు వృథాగా పోతుందన్న వార్తలు మీడియాలో వచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. వచ్చే వారం కృష్ణ నదీ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ నేతలపై కూడా మంత్రి శ్రీహరి తీవ్ర విమర్శలు చేశారు. బీసీల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరి మరోసారి బయటపడిందన్నారు. గతంలో బండి సంజయ్‌ను తొలగించి కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిన తీరు ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతుందని విమర్శించారు. కుల గణన సర్వే అనంతరం కూడా బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవితకు కీలక పదవి ఇవ్వాలన్న సూచన చేస్తూ, రైల్ రోకో కార్యక్రమం చేపట్టేముందు పార్టీలో బీసీలకు ప్రాధాన్యత కలిగిన పదవి ఏర్పాటు చేయాలని అన్నారు.

## రైతుల భూములపై
# కాంగ్రెస్ నేతల కన్ను

### భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణ



**హైదరాబాద్:** ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారంగా కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన భూమిని.. కొందరు కాంగ్రెస్ నేతలు బలవంతంగా తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. "19,400 ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ సత్సంకల్పానికి మద్దతుగా భూములు ఇచ్చిన రైతులకు.. భారాస ప్రభుత్వం మెరుగైన నష్టపరిహారం ఇచ్చింది. పట్టా భూమికి ఎకరాకు రూ.16.5 లక్షలు, ఎసైన్డ్ భూమికి రూ.8.5 లక్షలు ఇవ్వడంతోపాటు నిర్వాసితులకు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 1,400 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో దాదాపు 560 ఎకరాల్లో భారీ లేఅవుట్‌ను రూపొందించింది. రైతులు ఇచ్చిన ఎకరా భూమికి బదులుగా అభివృద్ధి చేసిన 121 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ప్రకటించింది. అయితే, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో వారికి ఆ స్థలాలను అప్పగించే ప్రక్రియ వాయిదా పడింది. ఆ భూములను కొల్లగొట్టే ఉద్దేశంతోనే రేవంత్ సర్కారు ఏడాదిన్నరగా పొజిషన్ ఇవ్వడం లేదు. ఆ లేఅవుట్‌లో నుంచే 330 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేసింది. పైపెచ్చు కొందరు కాంగ్రెస్ నాయకులు రైతులను భయపెట్టి.. బహిరంగ మార్కెట్లో చదరపు గజం రూ.30 వేలు ఉంటే.. రూ.4-5 వేలకే కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకొని రైతులకు తిరిగి భూములు అప్పగించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

- అన్ని బీమా క్లెయిమ్‌లు అందిస్తాం
- క్షతగాత్రుల వైద్య ఖర్చుల బాధ్యత మాదే
- ప్రమాదంలో 40 మంది మృతి.. 33మందికి గాయాలు
- ప్రభుత్వ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాం
- కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటన



**సంగారెడ్డి, జులై 2 :** పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై సిగాచీ కంపెనీ స్పందించింది. పరిశ్రమలో పేలుడు కారణంగా 40 మంది మృతి చెందారని, మరో 33 మంది గాయపడినట్లు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్ ఇస్తామని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని సిగాచీ కంపెనీ హామీ ఇచ్చింది. ఈ మేరకు సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. 33 మందికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు పరిశ్రమ నుంచి కోటి పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్ చెల్లిస్తాం. గాయపడ్డ వారికి పూర్తి వైద్యం అందిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. పరిశ్రమ ప్రమాదంపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి లేఖ రాశాం. మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలు మూసివేస్తున్నాం. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు. ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంది. ప్రభుత్వం దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నాం' అని సిగాచీ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం ఘటనకు సంబంధించి దర్యాప్తుకు సహకరిస్తామని.. నిబంధనలు పాటిస్తాం అని ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేయటంతో పాటు వారి కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని వివేక్ కుమార్ పేర్కొన్నారు. 35 ఏళ్లలో ఎలాంటి ప్రమాదం జరగలేదని.. ఇది ఘోర ప్రమాదని పేర్కొన్నారు. 3 నెలల పాటు కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నా ప్రకటించారు. కంపెనీని పదేళ్ల క్రితం ఎలాంగో గౌడకు లీజుకు ఇచ్చామని.. కంపెనీ బాధ్యతలు ఆయనే చూస్తున్నారని తెలిపారు. పేలుడు ఘటనలో ఎలాంగో గౌడ చనిపోవటంతో వివరాలు తెలియడం లేదని తెలిపారు. ప్రమాదంపై స్టాక్ ఎక్స్ఛేంజ్ కు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక సిగాచి కంపెనీపై 4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కంపెనీ ఉద్యోగి యశ్వంత్ ఇచ్చిన కంప్లైంట్ తో కేసు నమోదయ్యింది. కంపెనీలో వాడుతున్న పాత మిషనరీ కారణంగా పేలుడు సంభవించినట్లు ఎఫ్ఐఆర్ లో పోలీసులు పేర్కొన్నారు.

## పాశమైలారం ఘటనపై నిపుణుల కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలను కమిటీ తెలుసుకోనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది. మరోవైపు సిగాచి పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనాస్థలం నుంచి శిథిలాల తరలింపు ప్రారంభమైంది.

## బయట వారికి సద్దులు కడుతూ.. కేసీఆర్‌పై నిందలు

- బనకచర్లపై దుష్ప్రచారాలు ఆపండి
- అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా?
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్



**హైదరాబాద్, జులై 2 :** బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు సవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. . అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు.

### రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్

రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్.. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్ట్‌లను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్ రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు.

### బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపిన ఉత్తమ్

సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్దాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

## రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

### కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జులై 2 :** రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశించిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్‌పంటల కు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్ సీ ఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

## తమిళనాడులో పవన్‌కల్యాణ్‌పై కేసు

### మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ, జులై 2 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడులో కేసు పెట్టడం మురుగన్‌పై దాడిగా భావిస్తామని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడు ప్రభుత్వం కేసు పెట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వంపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే ఓటమి తథ్యమని పీవీఎన్ మాధవ్ తెలిపారు. తమిళనాడులోదుర్మార్గపు పాలన ఉందని విమర్శించారు. సనాతన ధర్మం నాశనం అయిపోవాలని, వేదాంగాలపైన నీచమైన ఆలోచన కలిగిన ప్రభుత్వం తమిళనాడులో ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడలో జాతీయ హిందూ ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, మాధవ్, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. అన్నామలైకి అండగా పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగారని చెప్పుకొచ్చారు. పవన్ కల్యాణ్, అన్నామలైకి తాము అండగా ఉంటామని పీవీఎన్ మాధవ్ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా గోమాతను జాతీయ జంతువుగా గుర్తించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి సూచించారు. ఉత్తరాదిలో చాలా దేవాలయాలు మద్యం, మాంస రహితంగా ఉన్నాయని వెల్లడించారు. తిరుమల, తిరుపతిలను కూడా మద్యం, మాంస రహితంగా చేయాలని కోరారు. తిరుమల తిరుపతిని పవిత్రంగా ఉంచి.. టెంపుల్ సిటీగా ప్రకటించాలని సూచించారు. అయోధ్యలాగా తిరుపతి తిరుమలను మద్యం, మాంస రహితంగా, అన్యమత ప్రచార రహితంగా చేయాలని అన్నారు. దేవాలయాల భూములు, ఆస్తులను సంరక్షించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి కోరారు.

## మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర

- మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్‌ల రాక
- మంత్రిని నిలదీసిన బాధిత కుటుంబాలు



**సంగారెడ్డి, జులై 2 :** సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు నిలదీసారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారుల ముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని.. 13 మంది మిస్సింగ్‌లో ఉన్నారని తెలిపారు. 11 మంది మృతదేహాలను అప్పగించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని.. ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర వెల్లడించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సీరియస్‌గా తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని.. కంపెనీ నుంచి కూడా బాధితులకు నష్టపరిహారం అందజేసేలా చూస్తామని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీ వేశామని మీనాక్షి తెలియజేశారు. ముఖ్యమంత్రి , మంత్రులు ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మృతదేహాలను ప్రత్యేకంగా ఫ్రీజర్లలో మార్చురీలో భద్రపరిచామన్నారు. గాయపడిన వారికి కంపెనీ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమలో మూడోరోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ క్రేన్లు, జేసీబీలతో శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే తమ వారి ఆచూకీ తెలియడంలేదంటూ ఘటనా స్థలిలో బంధువుల ఆందోళనకు దిగారు.




## కొన్ని వస్తువులపై జిఎస్టీ భారం తగ్గింపు

### ప్రభుత్వ యోచనలో ఉన్నట్లు సమాచారం

**న్యూఢిల్లీ, జులై 2 :** ఈ ఏడాది ఆదాయ పన్నుల రాయితీల రూపంలో మధ్యతరగతి వర్గానికి ఉపశమనం కల్పించిన కేంద్ర ప్రభుత్వం మరో చర్యకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, తక్కువ ఆదాయ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వస్తు సేవల పన్ను(జీఎస్‌టీ) తగ్గించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 12 శాతం జీఎస్టీ స్లాబ్‌ను పూర్తిగా తొలగించం లేదా ప్రస్తుతం 12 శాతం పన్ను విధించబడుతున్న అనేక వస్తువులను దిగువన 5 శాతంలోకి తిరిగి చేర్చడం వంటి వాటి గురించి కేంద్రం ఆలోచిస్తోంది. ఈ అరేంజ్మెంట్ మధ్యతరగతి, ఆర్థికంగా బలహీన వర్గాలు ఉపయోగించే టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, దుగులు, కుట్టు యంత్రాలు, ప్రెషర్ కుక్కర్లు మరియు వంటగది పాత్రలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, చిన్న సామర్థ్యం గల వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ. 1,000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ. 500 నుండి రూ. 1,000 మధ్య ధర కలిగిన పాదరక్షలు, స్టేషనరీ వస్తువులు, టీకాలు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటి వాటి ధరలు తగ్గే అవకాశం ఉంది. మార్పులు అమలు చేయబడి తే ఈ వస్తువులు చాలా వరకు తక్కువ ధరలకు వస్తాయి. మరోవైపు, ప్రభుత్వం సరళీకృతమైన, సులభంగా పాటించే జీఎస్టీని కూడా పరిశీలిస్తోంది. అయితే, ఈ చర్యల వల్ల ప్రభుత్వంపై రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల వరకు భారాన్ని మోపుతుందని తెలుస్తోంది. అయితే, వినియోగం పెరిగితే జీఎస్టీ వసూల్లు పెరుగుతాయని కేం ద్రం నమ్ముతోంది. మరోవైపు, కేంద్రం ఈ చర్యలకు ఒప్పు కున్నా రాష్ట్రాలు ఏ విధంగా భావిస్తాయనేది చూడాలి. ఇప్ప టి వరకు జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఒకసారి మాత్రమే ఓటింగ్ జరిగింది. ప్రతీ నిర్ణయం కూడా ఏకాభిప్రాయం ప్రకారమే తీసుకుంది. ఈ నెల చివర్లో జరిగే 56వ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వస్తుందని భావిస్తున్నారు.

## చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

- 5691 మంది చేనేత కార్మికులకు లబ్ది
- పరిపాలన అనుమతులు జారీచేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడి



**హైదరాబాద్, జులై 2 :** ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ. 33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు మరి యు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకొన్న రూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి)కే మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగు తుందని, వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫిని జమ చేయడం జరుగుతుందని అన్నారు. రుణ మాఫీ జరిగిన అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే బ్యాంకర్లు మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిగారు పేర్కొన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు 920 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖల నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు, అందుకు అనుగుణంగా ఇప్పటికే 579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర&ఢర్లు వచ్చాయని అన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన 290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేశామన్నారు. మా ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా మరోసారి తెలియజేశారు.




## బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

- 17న రైలురోకో చేసి తీరుతాం
- ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన కవిత

**ఖమ్మం, జులై 2 :** 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభా గంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడు తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం – బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు.

## సంపాదకీయం

# జిఎస్టీ బాదుడుపై నోరు మెదపని చంద్రబాబు




జిఎస్టీ ఏ ముహూర్తాన వచ్చి చేరిందో కానీ ప్రజల నడ్డి విరుస్తోంది. ఎంతగా అంటే ఏది కొన్నా దానిపై అధిక మోతాదులో పన్నులకే సరిపోతోంది. చివరకు మనం ఆరోగ్యం కోసం తీసుకున్న ఇన్సూరెన్స్, సేవింగ్స్ కోసం తీసుకున్న జీవితభీమాలపైనా జిఎస్టీ తప్పడం లేదు. 12 నుంచి 18శాతం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి, నితీశ్ కుమార్ పార్టీలతో సహా ఇతర చిల్లర పార్టీలు కూడా దీనిపై మోడీని నిలదీయడం లేదు. ప్రజలు పడుతున్న బాధలకన్నా ఆదాయం సమకూరడమే వారికి ముఖ్యమయ్యింది. ఎందుకంటే జిఎస్టీ ఎంత వసూలు అయితే అందులో సగం రాష్ట్రాలకు వెళుతుంది. దీంతో పెన్షన్లు, కిలో రూపాయి బియ్యం ఇవ్వడం వంటివి అలవాటు చేసుకున్నారు. పెన్షన్ల పంపిణీకి స్వయంగా సిఎం చంద్రబాబు వెళ్లడం, పెద్దపెద్ద మీటింగ్‌లు పెట్టడం, చెక్కులు అందించడం దారుణం కాక మరోటి కాదు. ప్రతినెలా ఇవి ఖాతాల్లో నమోదు అవుతాయి. వీటికోసం హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు వేసుకుని వెళ్లి చెక్కులు అందించడం దుబారా ఖర్చు కాక మరోటి కాదు. ఇంతగా దుబారా జరుగుతున్న ఎవ్వరూ నిలదీయడం లేదు. దుబారా పథకాలతో ఓట్లు దండుకునే ఎత్తులు తప్ప రాజకీయ నాయకులకు దేశం, రాష్ట్ర, ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకుండా పోయింది. దుబారాలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం ఫ్యాషన్‌గా మారింది. ఇకపోతే క్వాంటమ్, పోలవరం, అమరావతి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు జిఎస్టీ వడ్డింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే మోడీకి కోపం తెప్పించే ఏ పనీచేయక పోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో మోడీతో పెట్టుకుని ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న అనుభవం ఉంది.

ఇకపోతే తాజా గాణాంకాల మేరకు రాష్ట్రంలో జీఎస్టీ వసూ ళ్లు పెరిగాయి. ఈ ఏడాది జూన్‌లో రూ.2,591 కోట్ల నికర జీఎస్టీ వసూలైంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలకు ఇదే అత్యధికం. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం వసూలైన నికర జీఎస్టీ రూ.8,860 కోట్లు. గతేడాది జూన్‌లో వచ్చిన రూ.3,910 కోట్ల పన్ను ఆదాయం కంటే ఇది 6.58 శాతం ఎక్కువ. ఈ ఏడాది జూన్‌లో ఐజీఎస్టీ సెటిల్మెంట్ రూ.1,365 కోట్లు వచ్చింది. వృత్తి పన్ను రూ.29 కోట్ల నుంచి రూ.49 కోట్లకు పెరిగింది. లిక్కర్‌పై వ్యాట్ రూ.61 కోట్ల నుంచి రూ.86 కోట్లకు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ రూ.1,380 కోట్ల నుంచి రూ.1,435 కోట్లకు పెరిగింది. ఇవన్నీ బాబు లాంటి వారికి ఆనందం కలిగించేవే. ఎందుకంటే ఆదాయం వస్తే తమ వాటా కూడా వస్తుందన్న ఆనందం. అందుకే బాబు జిఎస్టీపై నోరు మోఎదపడం లేదు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాట్ స్థానంలో జీఎస్టీ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇది ప్రభుత్వానికి ఆదాయం పెరగటానికి తోడ్పడింది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఇన్సూరెన్స్‌పై జిఎస్టీ తగ్గించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరినా నిర్మలా సీతారామన్ ఈసడించుకున్నారు.

నిజానికి ప్రజల సమస్యలను తెలుసుకునే బదులు ఎదురుదాడి చేశారు. అయితే ప్రస్తుతం మధ్యతరగతి భారతీయులకు అనుగుణంగా పన్ను రేట్లలో తగ్గింపును అందించ బోతున్నట్లు వెల్లడైంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అనేక వస్తువుల ధరలను అధిక జీఎస్టీ బ్రాకెట్ నుంచి తక్కువ పన్నులకు మార్చాలని కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వెల్లడైంది. ఇదే నిజమైతే దీనిపై చర్చ చేయాలి. ఏయే రంగాల్లో ప్రజలు బాధపడుతున్నారో గుర్తించాలి. రాష్ట్రాల సిఎంలతో చర్చించాలి. అయితే ప్రస్తుతం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ఆదాయం కలిగిన ప్రజల కోసం జీఎస్టీ పన్నుల విషయంలో కూడా పెద్ద మార్పులకు కేంద్రం శ్రీకారం చుడుతోందని సమాచారం. దీనికింద 12 శాతం కింద ఉన్న అనేక వస్తువులపై పన్నును 5 శాతానికి తగ్గించనున్నట్లు వెల్లడైంది. నిజంగా ఇలాంటి ఆలోచన ఉంటే అనేక రంగాలపై పన్ను శాతాన్ని అత్యదికంగా 5శాతానికి తగ్గిస్తే మేలు. ఇకపోతే పన్నుల్లో హేతుబద్దత లేకపోవడం వల్ల చిన్న,మధ్యతరగి ప్రజలు, కంపెనీలు జిఎస్టీ కట్టుకోలేక దివాళా తీస్తున్నారు. వస్తువలపై డబుల్ డబుల్ పన్నులు పడుతున్నాయి. ఉప్పులు, పప్పులపై జిఎస్టీ పడ్డాక కూడా ఇడ్లీ దోశలపై పన్నులు వాయిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేయలేని దుస్థితి నెలకొంది. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అత్యధిక అక్షరాస్యత వున్న కేరళ తలసరి ఆదాయం దేశంలో మొదటి స్థానంలో వుంది. తర్వాత స్థానాల్లో తమిళనాడు, తెలంగాణ వున్నాయి. బీహార్ తలసరి ఆదాయం అతి తక్కువగా వుండడానికి అక్షరాస్యత కూడా ముఖ్య కారణమన్నారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటిపై పన్నులు అంటే జిఎస్టీ వసూళ్లు దారుణంగా ఉన్నాయి. ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు.

# డిమాండ్‌కు అనుగుణంగా పంటలకు ప్రోత్సాహం ఏదీ?

- వ్యవసాయానుబంధ రంగాలకు దక్కని ఊరట
- నిపుణుల సలహాలు పట్టించుకోని పాలకులు



**న్యూఢిల్లీ, జులై 2 :** దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయ లేనంతకాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. అయినా ఇటువైపు పాలకులు దృష్టి సారించడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది. ఈ క్రమంలో వ్యవసాయాన్ని బలోపేతం చేస్తు తప్ప దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించలేదు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని మోడీ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018–19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయ రంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఆహార సబ్సిడీకి రూ.7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు 44,500 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారన్నది అర్థం కావడం లేదు. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధిం చాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించడం లేదు. దీంతో ప్రధాన సమస్యలపై ప్రజల ఆవేదన పట్టించుకోవడం మానేశారు.

# బీహార్‌లో బూత్‌స్థాయి ఏజెంట్ల పెంపు

- ఆందోళనలు రాకుండా ముందే చర్యలు
- నివాసం ఉన్న చోటే ఓటు ఉండాలని ఆదేశాం



**న్యూఢిల్లీ, జులై 2 :** బీహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్ఎ)ను పెంచాలని ఎన్నికల కమిషన్ బుధవారం ఆదేశించింది. తర్వాత ఆందోళనలు లేవనెత్తకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రణాళిక ప్రకారం సజావుగా కొనసాగుతోందని, జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను పాటిస్తోందని ఇసి పేర్కొంది. ఎస్ఐఆర్ పక్రియ గురించి రాజకీయ పార్టీలతో బుధవారం జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇసి వర్గాలు తెలిపాయి. భారీ కసరత్తులో సుమారు లక్షమంది శిక్షణ పొందిన బూత్ లెవల్ అధికారులు, 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 38 జిల్లా, ఎన్నికల అధికారులు, 9 డివిజన్‌ల కమిషనర్లు,బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి సమన్వయంతో లక్షమంది వాలంటీర్లు పాల్గంటారు. ఇసిఐ ద్వారా నమోదు చేసిన గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీలు ఇప్పటికే పోలింగ్ స్టేషన్లలో 1.5లక్షలకు పైగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకున్నప్పటికీ, పార్టీలు అదనపు బిఎల్ఎలను నియమించడానికి సమయం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. తర్వాత ఫిర్యాదు చేయడం కన్నా ముందుగానే ఎక్కువ మంది బిఎల్ఎలను నియమించాలని ఇసి వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్ననేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. నివాసం ఉంటున్న చోటే ఓటు ఉండాలన్న నిబంధన పాటించాలని అన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చుని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.



## మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు

### జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల జాతర

**ములుగు, జులై 2 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర తేదీలు ఖరారయ్యాయి. మేడారం మహా జాతర 2026 తేదీలను కోయ పూజారులు ప్రకటించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది. మేడారంలో 2026లో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర తేదీలను పూజారులు ఖరారు చేశారు. జాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించారు. బుధవారం మేడారంలోని ఎండోన్‌మెంట్ కార్యాలయంలో పూజారులు, పుర ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడారు. 2026 జనవరి 28వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 28న బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుండి సారలమ్మ, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులను గద్దెలపైకి తీసుకొస్తారని, జనవరి 29వ సాయంత్రం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దె మీదకు తీసుకొస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 30వ తేదీన వన దేవతలకు మొక్కులు చెల్లింపులు, జనవరి 31వ తేదీన తల్లుల వన ప్రవేశం ఉంటుందని ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా 2024 జాతర తేదీలను 9 నెలల ముందుగానే ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. ఆపై 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని కోయ పూజారులు వెల్లడించారు. ఈ జాతరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూజారులు కోరుతున్నారు. కాగా.. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం జాతర జరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది.

# టిబెట్ బౌద్ధగురువు ఎంపికలో చైనా జోక్యం సహించడం

- తన వారసత్వం కొనసాగాలా లేదా అన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దలైలామా




**న్యూఢిల్లీ, జులై 2 :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక పక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ పక్రియలో మరెవరి కీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా– ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే పక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

## శంషాబాద్‌లో వర్షాలతో మేఘావృతం

### విమానాలకు ప్రతికూల వాతావరణం

**హైదరాబాద్, జులై 2 :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నిన్న సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి ప్రతికూల వాతావరణం ఏర్పడడం కారణంగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల ల్యాండింగ్‌కు అధికారులు అనుమతివ్వలేదు. దీంతో కొన్ని విమానాలు బెంగళూరు, విజయవాడ వైపు మళ్లించారు. లక్నో, కోల్‌కతా, ముంబై, జైపూర్ నుంచి వచ్చే విమానాలను బెంగళూరు ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. బుధవారం ఉదయం నాటికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో.. అన్ని విమానాలు యథావిధిగా కొనసాగుతున్నాయని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉధృతి



**శ్రీశైలం, జులై 2 :** శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. జూరాల నుంచి శ్రీశైలానికి 83.224 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రస్తుత నీటిమట్టం 875.2 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 164.7 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్తత్తి చేసి 35,315 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.



## సీపీఐ గ్రామశాఖ అధ్యక్షుడు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ బియ్యం వితరణ

**కారేపల్లి నేడు న్యూస్:** మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి సీపీఐ గ్రామశాఖ అధ్యక్షుడు అమీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో, గురువారం వారి దశదిన కర్మలకు 50కేజీల బియ్యంను వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ వారి కుటుంబానికి వితరణ చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు అజ్మీర వీరన్న, కాంగ్రెస్ నాయకులు బొడ సెత్రం, సీపీఐ మండల సెక్యూరిటి బొల్లా రామస్వామి, మాజీ ఎంపీటీసీ ఏల్లపులి ధనరాజ్, మండల నాయకులు చేరుకురి నర్సయ్య, రెడ్డబోయిన రవి, ఎండి రియాజ్, గ్రామశాఖ కార్యదర్శి అమ్మ, లావుడియా కిషన్, నుకల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా దళితబంధు యూనిట్లు

### విచారణ జరపాలని డిమాండ్



**వైరా నేడు న్యూస్:** జూలూరుపాడు మండలంలో పీశా చట్టం (1/70 యాక్ట్) ఉల్లంఘన చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో దళిత బంధు యోజన కింద ఇచ్చిన యూనిట్లపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంగా గుర్తించబడినదని, ఇక్కడ దళితులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున వ్యాపార, రవాణా, షాపులు, వెహికల్స్ వంటి యూనిట్లు ఇవ్వడమే కాకుండా, కొందరు వాటిని ఉపయోగించకుండా షాపులు మూసివేసి, వాహనాలు అమ్మేసి, సదుపాయాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. "మాకు పెద్ద పెద్ద పార్టీ నాయకులు అండగా ఉన్నారు. మమ్మల్ని ఎవరు ఏమీ చేయలేరు" అన్న భావంతో నిబంధనలు లెక్కచేయకుండా ప్రభుత్వ పథకాలను మళ్ళీ మళ్ళీ కోరుతున్న దృశ్యం కనిపిస్తున్నదని ఆయన చెప్పారు. ఇలాంటి చర్యలు కొనసాగితే, తద్వారా ఇతర పేద సామాజిక వర్గాలైన ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు కూడా ఈ పథకాలు అందకుండానే మిగిలిపోతాయని హెచ్చరించారు. అందుకే సంబంధిత అధికారులు తక్షణమే మండలంలోని దళితబంధు యూనిట్లపై, వాహనాలపై సమగ్ర సర్వే నిర్వహించి, షాపులు మూసివేసినవారిపై, వాహనాలు విక్రయించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బానోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు.



## శ్రీవాణి కుటుంబాన్ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి

**పరకాల నేడు న్యూస్ :** పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో ఉరివేసుకొని బలవన్మరణం చెందిన పరకాల పట్టణానికి చెందిన ఏకు శ్రీవాణి కుటుంబాన్ని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి బుధవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..శ్రీవాణి ది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్య అని అన్నారు. ఈ ఘటనపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగకుండా పూర్తి విచారణ చేసి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో గురుకుల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయన్నారు. అయిన గాని ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. అదే విధంగా ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ తో మాజీ ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడారు. గురుకుల పాఠశాలను ఒకసారి సందర్శించి మిగతా పిల్లలకు మనోధైర్యం కల్పించాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో పరకాల పట్టణ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు ఉన్నారు.



## ఘనంగా టీడీపీ నాయకులు సత్తార్ జన్మదిన వేడుకలు

- కెపిహెచ్బి ఫంక్షన్ హాల్ లో అభిమానులు మధ్య వేడుకలు
- పార్టీలకు అతీతంగా హాజరైన ప్రముఖులు, నాయకులు

**కూకట్ పల్లి: నేడు న్యూస్ :** కెపిహెచ్బి కాలనీ 114 డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ పుట్టినరోజు వేడుకలు కాలనీ లో ఘనంగా నిర్వహించారు. షేక్ సత్తార్ జన్మదిన వేడుకలకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు, వివిధ సంఘాల నాయకులు, అసోసియేషన్ సభ్యులు, ఆత్మీయ మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి ఆయనకు శాలువాలతో సత్కరించి కేక్ కటింగ్ చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ షేక్ సత్తార్ మంచికి మారుపేరని, ఎవరు ఆపదల్లో వున్నా నేనున్నానంటూ వెంటనే వచ్చి వారిని ఆదుకుంటారని, పేరుకి అతను ముస్లిం అయినా ఒక ముస్లిం లాగా వ్యవహరించరని అందరితో కలిసి మెలిసి ఆప్యాయతో ఆత్మీయంగా ఉంటూ ప్రజలకు సేవ చేసే స్వభావం కలిగిన వారని కొనియాడారు. అనాతేకాకుండా రాబోవు రోజుల్లో ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ నిర్లక్ష్యం

- అనుమతి లేకున్నా అక్రమ కట్టడాలు నిర్మిస్తాం
- గుండ్లపోచంపల్లి పురపాలక సంఘంలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ముడుపుల కోసమే మౌనమా...?
- గుండ్లపోచంపల్లిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే
- ప్రభుత్వ ఆదాయానికి పడుతున్న గండి !

**సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు... బడా బాబులు అక్రమంగా భారీ భవనాలు నిర్మిస్తున్న సంబంధిత టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ కన్నెత్తి చూడడం లేదని పలువురు గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు వాటి జోలికి వెళ్లాలంటే జంకుతున్నారు. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీ ప్లస్ 2 కి అనుమతులు తీసుకొని ఎలాంటి నిబంధనలు పాటించకుండా రోడ్డుని సైతం ఆక్రమించుకొని సెల్లార్లను తవ్వి జీ ప్లస్ 4, జీ ప్లస్ 5, అక్రమ అంతస్తులపై పెంట్ హౌస్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు జోరు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న అక్రమ భవన నిర్మాణాలను అరికట్టడంలో సంబంధిత శాఖ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.**





**మేడ్చల్ ప్రత్యేక ప్రతినిధి, నేడు న్యూస్ :** గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని అక్రమ భవనాలు, యదేచ్ఛగా నిర్మిస్తున్నప్పటికి గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ పట్టించుకోవడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ అక్రమ భవనాలు నిర్మించడంతో బిల్డర్లు రెచ్చిపోయి పురపాలక సంఘం అనుమతి లేకపోయినప్పటికి అంతస్థులకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురపాలక సంఘం అనుమతి తీసుకున్న తర్వాతనే భవనాలు నిర్మించాలి. కానీ ఇవేమి లేకుండానే అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా భారీ భవనాలను నిర్మిస్తున్నారు. అక్రమ భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక సంఘం అధికారులు హెచ్చరిస్తున్నప్పటికి బిల్డర్లు తమ ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారనే ఆరోపణలు జోరుగా నిపిస్తున్నాయి. గృహ నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతి రాకుంటే వచ్చినట్లు భావించి ఇళు నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత టౌన్ ప్లానింగ్ శాఖ సూపర్వైజర్ మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడంతో ప్రభుత్వ



ఆదాయానికి వారే దగ్గరుండి గండి కొట్టిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పురపాలక శాఖ పరిధిలో గృహ నిర్మాణ అనుమతులను టీఎస్ బీపాస్ ద్వారా తీసుకుని ఆ తర్వాత నిర్మాణాలను చేపట్టాలని చట్టం తెలుపుతున్న టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ల అండదండలతో అవేమీ పట్టించుకోకుండా అనుమతులను తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి తీసుకోవాలంటే ప్లాటుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంటే సత్వరమే సంబంధిత అనుమతులు ఇస్తారు. ఆర్ అండ్ బీ అధికారులు స్థలాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ సిబ్బంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి అన్ని సవ్యంగా ఉంటే పురపాలక శాఖ కమిషనర్ లాగిన్ కు పంపిస్తే సంబంధిత నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తారు. ఈ అనుమతి పొందిన మేరకే ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం కాకుండా చట్టవిరుద్ధంగా ఇళ్ల నిర్మాణం జరిగితే మూడు రోజుల్లోనే ఆ ఇంటి నిర్మాణం కూల్చి వేసి నిర్మాణ ఆస్తి విలువలో 25 శాతం భవన నిర్మాణం యజమాని నుంచి సంబంధిత శాఖ వసూలు చేస్తారు. ఎల్ఆర్ఎస్ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే నిషేధిత ఆస్తి జాబితాల్లో దాన్ని చేర్చి విద్యుత్, నల్లా కనెక్షన్ తో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సేవలను నిలిపివేస్తారు. ఇళ్లను తనిఖీ చేసేందుకు వెళ్లినప్పుడు అనుమతులు అతిక్రమించి నిర్మిస్తే ఆ నిర్మాణానికి సంబంధించి ఫోటోలు తీసి వీడియో రికార్డు చేసి పంచనామా చేస్తారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా రెండు, మూడంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైన గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు గుండ్లపోచంపల్లి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం ప్రజలు కోరుతున్నారు.

## రాజీవ్ గృహకల్పలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

### రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్పలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పింక్ క్వార్టర్ లో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన పర్యటించారు. ఎన్నో ఏళ్లుగా సుదీర్ఘంగా ప్రజలకు మంచినీరు అందుబాటులో లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని గ్రహించి, నూతన వాటర్ పైప్ లైన్ కనెక్షన్ మంజూరు చేసి వేయించారు. పైన అపార్ట్మెంట్స్ కు మంచినీరు అందే విధంగా తదితర అంశాల గురించి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కరించేంత వరకు అధికారులను నిరంతరం సమీక్షించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డ్ సొసైటీ సంబంధించి ఆఫీసర్లతో చర్చించడం జరుగుతుందని, పూర్తిస్థాయిలో మంచినీరు అందే విధంగా కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికే జనార్ధన్, తలారి చిన్న, బబ్లూ, మోహన్ రెడ్డి, అంజమ్మ, అడికె శివ, రాజేష్, సచిన్, ఎన్ను శంకర్ రెడ్డి, జలమండలి డీజీఎం రేణుక, జీహెచ్ ఎంసీ వర్క్ ఇన్స్పెక్టర్ భాను, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ మ్యానుహెూల్ సమస్యను పరిష్కరించాలి

### భారతీయ రాష్ట్ర సమితి సీనియర్ నాయకురాలు ఏర్వ సరిత మహేష్



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓల్డ్ కర్నూల్ రోడ్డులో ఉన్న రాంచరణ్ ఆయిల్ మిల్ ప్రధాన రహదారి వద్ద డ్రైనేజీ మ్యాన్‌హెూల్ మూత లేకపోవడం, చెత్తతో నిండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యను సత్వరమే పరిష్కరించాలని భారతీయ రాష్ట్ర సమితి సీనియర్ నాయకురాలు ఏర్వ సరిత మహేష్ అన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సరిత మహేష్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులే తాత్కాలికంగా ఒక కర్రను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మ్యాన్‌హెూల్ పూర్తిగా చెత్తాచెదారంతో మూసుకుపోవడం వల్ల డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోందని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు గుర్తించి త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తక్షణమే మ్యాన్‌హెూల్‌కు మూత ఏర్పాటు చేసి, చెత్తను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.



## కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత సంతోషకరం

### గండిపేట్ మండల విద్యాధికారి విజయ కుమార్

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కిస్మత్పూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ఎస్ఎస్సీ ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమని గండిపేట్ మండల విద్యాధికారి విజయ కుమార్ అన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాతను మండల విద్యాధికారి విజయకుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ.. కేజీబీవీలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇదే విధంగా ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిరంజన్, సునీల్ కుమార్, ఉపాధ్యాయులు మంగ్యా నాయక్, రత్నారెడ్డి, శివరాం, మాజీద్, మంజుల, ఇందిరా, యశోద, అమృత, అలివేలు, సుదర్శన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

### కూల్చివేతలు చేపట్టిన అధికారులు

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** మణికొండ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను సహించేది లేదని మున్సిపాలిటీ అధికారులు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురిలో అక్రమంగా కట్టిన 6 వ రో హౌస్ కూడా మణికొండ మున్సిపాలిటీ అధికారులు కూల్చివేత చేపట్టారు. ఇప్పటి వరకు 5 అక్రమ రో హౌస్ లు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను సహించబోమని అన్నారు. ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినా తమ దృష్టికి తేవాలని తెలిపారు. కాగా ఈ 6 రో హౌస్ లకు సుమారు రూ. 1.5 కోట్ల సొసైటీ సొమ్ము వృధా చేసిన సొసైటీ కమిటీ (2015–2025) పైన, అధికారులపైన క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిత్రపురి సాధన సమితి డిమాండ్ చేశారు.





## నాసిరకంగా రోడ్లు వేస్తూ ప్రజాధనం వృధా చేయడం బాధకరం

### మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** నాసిరకంగా రోడ్లు వేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ ద్వారా ల్యాంకో హిల్స్ మొదలుకొని లక్ష్మీ నగర్, అంజలీ గార్డెన్ వరకు 2022 లో రోడ్డు వేశారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయం 2023 లో టీమ్స్ ఫోర్ ప్రాజెక్ట్ వారి స్వలాభం కోసం మణికొండ మున్సిపాలిటీ ల్యాంకో హిల్స్ దాటిన తరువాత లక్ష్మీ నగర్ మొదలుకొని అంజలీ గార్డెన్ వరకు రహదారి మధ్యలో డ్రైనేజ్ పెద్దలైన్ వేయడం కొరకు వారు రోడ్డును త్రవ్వడం చేసిన నిర్వాకం వలన ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. పై పెచ్చు నాలుగైదు పర్యాయాలు రోడ్డు కృంగిపోవడం ప్రజలు ఇబ్బందుల పాలవడం దరిమిలా మున్సిపాలిటీ అధికారులు అందుకు తగ్గట్టు తూతూ మంత్రంగా నాసిరకంగా మరమ్మత్తులు చేయడం మినహా అందుకు సంబంధించిన టీమ్స్ ఫోర్ ప్రాజెక్ట్ వారి వద్ద నుండి ఎలాంటి నష్ట పరిహారం వసూలు చేయకపోవడం పట్ల మండిపడ్డారు. అప్పటి మున్సిపాలిటీ ప్రజా పరి పాలకుల సభ (కౌన్సిల్) నిర్వాక ఫలితం అని స్థానికులు వాపోయారు. సంఘటితంగా భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు బుధవారం రోజున స్థానిక సమస్యలు తెలుసు కొవడానికి తిరగడం జరిగినది. ఇచ్చట ఇండ్ల మధ్యలో పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా రెడీ మిక్స్ కాంక్రేట్ ప్లాంట్ నడుపుతు అందుకు సంబంధించిన వాహనాలు తిరగడంలో కూడా రోడ్డు ధ్వంసమౌతుందని, ఈ విషయమై స్థానికులకు భారత రాష్ట్ర సమితి మణికొండ మునిసిపాలిటీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. ప్రజా పరిపాలన సమయం ముగిసిన ప్రస్తుత తరుణంలో రూ. 60 లక్షల బడ్జెట్ తో రోడ్డును వేయడానికి పూనుకోవడం, ఈ మేరకు ప్రజాధనం దుర్వినియోగం పరచడమని తెలిపారు. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రజల మేలుకోరి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భానుచందర్, మహమ్మద్ ఆరిఫ్, ధర్మపురి సుమనళిని, షేక్ ఆరీఫ్, శ్యామలేట్ రేఖ తదితరులు పాల్గొన్నారు.



## రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసిన హథిరామ్ నాయక్

**ఇల్లందు,నేడున్యూస్:** తెలంగాణ రాష్ట్ర బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన ఎన్ రామచంద్రరావును గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. హథీరామ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు జల్లరపు శ్రీనివాసరావు,దరావత్ బాలాజీ నాయక్, మండల అధ్యక్షులు గాంధీ నాయక్, శంభు నాయక్, అజయ్ పాల్గొన్నారు.



## ఎస్.టి.పి ప్లాంట్ల నిర్మాణం పూర్తయితే మరుగునీటి సమస్యకు పరిష్కారం: కృష్ణారావు

**కూకట్ పల్లి: నేడు న్యూస్ :** బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీ నగర్ డివిజన్లోని నూతనంగా నిర్మిస్తున్న ఎస్టిపి ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. అలాగే అంబేద్కర్ నగర్ కాలనీలో డ్రైనేజ్ సమస్యపై కోర్టు అసోసియేషన్ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కరించే దిశగా సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ .టి. పి ప్లాంట్ల నిర్మాణం పూర్తయితే నియో జకవర్గంలోని మరుగునీటి సమస్యకు పరిష్కారమయి అలాగే దోమల బెడద కూడా తగ్గుతుందని. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఆనాడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ ఆధ్వర్యంలో కుకట్పల్లి నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో ఎస్టిపి ప్లాంట్ల నిర్మాణం చేపట్టామని. ఇందులో భాగంగానే అవి పూర్తయ్యే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు.. డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీగాచి ప్రమాదంతోనైనా అలసత్వం వీడాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**కుత్బుల్లాపూర్, నేడు న్యూస్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం లోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడులో 19 కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఇలాంటి దుర్ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలంటే రాష్ట్ర ప్రభుత్వంలోని సీఎం,మంత్రులు పర్యటనలకి పరిమితం కాకుండా అధికారుల్లో ఉన్న అలసత్వాన్ని పారద్రోలి చిత్తశుద్ధితో పని చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగవని కావున ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అనేక పేలుడులు జరిగాయని అందులో కార్మికులు మృతి చెందారని కానీ నాడు మంత్రులు కేవలం ప్రకటనలకే పరిమితమై కనీసం ఆ సంఘటన స్థలాన్ని సందర్శించలేదని, ఎక్స్గ్రేషియా ప్రకటించలేదని, ఆ పరిశ్రమల యాజమాన్యాలపై తూతూ మంత్రంగానే కేసులు పెట్టారని కానీ నేటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మంత్రులు సంఘటన స్థలాన్ని సందర్శించడం బాధితులకు కోటి రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించడం మంచి పరిణామంగా భావిస్తూ భవిష్యత్తులో అలాంటివి జరగకుండా పరిశ్రమలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఒకవేళ నిబంధనలను అతిక్రమించిన ఆ పరిశ్రమలను, పరిశ్రమ యాజమాన్యాలను కఠినంగా శిక్షించే చట్టాలను తీసుకురావాలని, నేటికీ జీడిమెట్ల గాంధీ నగర్ బాలానగర్ పారిశ్రామిక వాడలలో అనేక పరిశ్రమలు ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్ డబ్బాలను నిల్వ చేస్తున్నాయని అన్నారు.



## జర్నలిస్టు తేళ్ల శ్రీనివాస్‌కు పితృవియోగం

### నివాళ్లు అర్పించిన జర్నలిస్టులు నాయకులు

**కారేపల్లి నేడు న్యూస్ :** కారేపల్లికి చెందిన ప్రజాజ్యోతి విలేకరి తేళ్ల శ్రీనివాస్ తండ్రి గేటుకారేపల్లికి చెందిన తేళ్ల వెంకటేశ్వర్లు(93) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించటంతో మృతి చెందాడు. ఆయనకు భార్య తేళ్ల రాములమ్మ, ఇద్దరు కుమారులు తేళ్ల శ్రీనివాస్, హెూంగార్డు తేళ్ల వీరనాగేశ్వరరావు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌లు ఫోన్‌లో పరామర్శించారు. తేళ్ల వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వైస్‌ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, నాయకులు అజ్మీర వీరన్న, దమ్మాలపాటి ప్రసాద్, కారేపల్లి మండల జర్నలిస్టులు సందర్శించి నివాళ్లు అర్పించారు. నివాళ్లుఅర్పించినవారులో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, కోశాధికారి పాలిక శ్రీను, సహాయకార్యదర్శి బానోత్ బాలు, సీనియర్ జర్నలిస్టులు ఏపూరి లక్ష్మినారాయణ, అనంతారపు వెంకటాచారి, పగడాల నాగేశ్వరరావు, ముక్కా వెంకటేశ్వర్లు, సోసైటీ కార్యదర్శి బల్లు హన్మంతరావు తదితరులు ఉన్నారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- నిధులు మంజూరు చేయించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్లూరి మహేష్
- ఘనంగా సన్మానించిన కాలనీవాసులు

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** పీర్జాదిగూడ నగర పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. హామీలు నెరవేర్చడంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా డివిజన్ ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ, అభివృద్ధి పట్ల చూపిన నిబద్ధతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్లూరి మహేష్ లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జిలాని పాషా, కాంట్రాక్టర్ ఇర్షాద్ ఖాన్, రాజశేఖర్, వంగూరి జంగయ్య, బాషా, సాయిరాం, సంగు రాజు, సురేష్, ఇబ్రహీం, సలీం, గౌస్, బిక్షపతి, తాహెర్, చారి, నరేష్, ఖాసీం, రామకృష్ణ, రమణ బాబు, అలువాల కృష్ణ, రంగయ్య, కొత్త యాదయ్య, అలువాల బాలయ్య, రాజు, బి.యాదగిరి, బిజిలి కృష్ణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలి

### జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్..



**కామారెడ్డి జిల్లా , జులై 02 నేడు న్యూస్ బ్యూరో :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీలకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మహిళ మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మహిళా, శిశు సంక్షేమ శాఖ పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముందు శ్యామ్, మామ్ పిల్లల శాతం అంగన్వాడీల వారీగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పౌష్టికాహారలోప పిల్లలకు ప్రత్యేక పౌష్టికాహారం అందించి క్రమం తప్పకుండా వారి ఎత్తు బరువులు కొలిచి వారు ఆరోగ్యవంతమైన పిల్లలుగా ఎదిగేల చర్యలు తీసుకోవాలి అన్నారు. వర్షాకాలం వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున అంగన్వాడి పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ వేడి ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలను విసిట్ చేసేటప్పుడు చిన్నారులు హాజరు శాతం తక్కువగా ఉంటుందని ఇకనుండి అంగన్వాడి కేంద్రాల్లో రిజిస్టర్ అయిన పిల్లలందరూ తప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు వచ్చేలా జిల్లా సంక్షేమ అధికారి, సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రతిరోజు అంగన్వాడి కేంద్రాలను విజిట్ చేయాలని అలాగే అంగన్వాడి కేంద్రాల్లో గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. వివిధ సందర్భాలలో గృహహింసకు గురైన మహిళలకు సఖి కేంద్రం ద్వారా సేవలు అందించాలని, అనాధ పిల్లల దత్తత, వివిధ సందర్భాల్లో రిస్కు చేసిన బాలలకు సంరక్షణ చర్యలు తీసుకోవాలని, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లో చిన్నారులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, డి ఎం అండ్ హెచ్ వో చంద్రశేఖర్, ఈ ఈ పిఆర్, విద్యుత్తు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సిడిపిఓలు, సూపర్వైజర్లు, మహిళా మరియు శిశు సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్లమెంట్ జహీరాబాద్ ఇంచార్జికి ఘన సన్మానం



**కామారెడ్డి జిల్లా, జులై 2, నేడు న్యూస్ బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ జహీరాబాధ్ పార్లమెంట్ ఇంచార్జి గా నియమించిన తర్వాత మొట్ట మొదటి సారిగా బాన్స్వాడ నియోజకవర్గ నికి విచ్చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి మరియు మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పాల శ్రీనివాస్ మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్ లకు బాన్సువాడ పట్టణం లోని మార్కెట్ కమిటీ ఆఫీస్ లో ( ఏనుగు రవీందర్ రెడ్డి సైన్యం) బాన్సువాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి గణేష్ మరియు టౌన్ అధ్యక్షులు మాసాని శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిచ్చారు. ఈ కార్యక్రమం లో కామారెడ్డి బ్లాక్ అధ్యక్షులు గూడెం శ్రీను, మాజీ జడ్పీటీసీ కొత్తకొండ భాస్కర్, మాజీ ఎఎంసి చైర్మన్ పాత బాలకృష్ణ, మత్స్యకార అధ్యక్షులు సత్యనారాయణ, యూత్ అధ్యక్షులు భానుగౌడ్, యూత్ నాయకులు యూనుస్, వెంకట్ రెడ్డి, బాడీశ్రీనూ, రమేష్, రవీందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, ఈశ్వర్, రవికిరణ్,సోహెయల్, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

### - సబ్ కలెక్టర్ కిరణ్మయి



**కామారెడ్డి జిల్లా, జులై 2, నేడు న్యూస్ బ్యూరో :** నిజాంసాగర్ మండలం రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,195 దరఖాస్తులు రాగా.. 306 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. మరో 87 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అటవీ దరఖాస్తులే ఎక్కువ మొత్తంలో ఉన్నాయని, ఆమె వివరించారు. అనంతరం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహశీల్దార్ భిక్షపతి, ఆర్ఐ సాయిలు, సీనియర్ అసిస్టెంట్ విజయ్, సర్వేయర్ శ్రీకాంత్ తదితరులున్నారు.

## కారేపల్లి కళాశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

### విద్యార్థులతో చర్చించిన అడిషనల్ కలెక్టర్



**కారేపల్లి నేడు న్యూస్:** కారేపల్లి ప్రభుత్వ కళాశాలను ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ బుధవారం తనిఖీ చేశారు. కళాశాల అవరణం కలియతిరిగారు. కళాశాలలో బోధన తీరుతెన్నులపై విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో సమస్యలు, మౌళిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో ఉంటూ కళాశాలకు వస్తున్న విద్యార్థులను భోజన వసతి, త్రాగునీరు విషయమై అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో సింగరేణి సంస్థ మంజూరు చేసిన నిధులు రూ. 30లక్షలతో జరుగుతున్న మరమ్మతులపై ఆరా తీశారు. కళాశాలకు ఇంటర్ బోర్డు మంజూరుచేసిన రూ. 20.50లక్షలతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం భజ్యాతండా గ్రామపంచాయతీలో పర్యటించి పారిశుధ్యంను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆదనపు కలెక్టర్ వెంట డీఐఈవో రవిబాబు, ఎంపీడీవో జీ.సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, కళాశల ప్రిన్సిపాల్ విజయకుమారి తదితరులు ఉన్నారు.

## గొంతు కోసి యువకుడి దారుణ హత్య



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** గొంతు కోసి యువకుడిని హతమార్చిన సంఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్ కు చెందిన రోషన్(35) వారం రోజుల క్రితం మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడకు జీవనోపాధి వచ్చాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతడు మురళీధర్ అనే వ్యక్తి దగ్గర పని చేస్తున్నాడని, మంగళవారం సుమారు అర్ధరాత్రి సమయంలో రోషన్ దారుణ హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. దీంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తాగిన మత్తులో కార్మికుడిపై దాడి చేసి హతమార్చినట్లు సమాచారం. హత్యానంతరం రోషన్ స్నేహితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం, జాగిలాలను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనంను విజయవంతం చేయాలి

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** లాల్ బహదూర్ స్టేడియంలో గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనంను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. జూలై 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధానం కార్యక్రమంలో భాగంగా ఈ సమ్మేళనం ఎంతో ప్రాధాన్యత కలిగిందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు సమర్పితంగా సాగుతున్న జై సంవిధాన్ కార్యక్రమం తెలంగాణలో విజయం వైపు కొనసాగుతోందని వివరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల పార్లమెంటు ఇంచార్జ్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్స్ పరీక్షల్లో నియమకాల్లో అవకతవకలపై విచారణ చేయాలి

### మైలార్ దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** గ్రూప్ 2 మరియు గ్రూప్ 3 మహిళా నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఈ మేరకు చర్చించేందుకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కంటెస్టెడ్ ఎమ్మెల్యే దాసరి ఉష, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పి కార్తీక్ రెడ్డిలను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిన అంశాలను మాజీ మంత్రికి వివరించి, మహిళలకు అన్యాయం జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలలో విద్యార్థులకు అన్యాయం జరిగిందని అన్నారు. వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో కొంపల్లి జగదీష్, యాదగిరి భాస్కర్, మల్లేష్ పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ పంపిణి చేసిన ఎంపీ

**కారేపల్లి నేడు న్యూస్:** కారేపల్లికి చెందిన ఎల్లంకి మ్యాగీ కుటుంబసభ్యులకు సిఎంఆర్ ఎఫ్ క్రింద మంజూరైన చెక్‌ను బుధవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అందశారు. అనారోగ్యంతో ప్రయివేటు వైద్యం చేయించుకున్న ఎల్లంకి మ్యాగీ సిఎంఆర్ఎఫ్ కోసం ఎంపీ రఘురామిరెడ్డి కి దరఖాస్తు చేసుకోగా ఎంపీ సిపార్స్‌తో సీఆర్ఎఫ్ మంజూరైంది. చెక్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, తొగరు శ్రీను, షేక్ మజీద్, బాధితులు ఎల్లంకి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి తహసీల్దార్ బదిలీ

### డీటీ కృష్ణయ్యకు ఇంచార్జీ బాధ్యతలు




**కారేపల్లి నేడు న్యూస్:** సింగరేణి తహసీల్దార్ సోమనబోయిన సంపత్‌కుమార్ బదిలీ అయ్యారు. 2024 ఫిబ్రవరి 17న సింగరేణి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్ సుమారు 17 నెలలు పాటు తహసీల్ధార్‌గా బాధ్యతుల నిర్వహించి సోంత జిల్లా మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. తహసీల్ధార్ బదిలీ కావటంతో సింగరేణి తహసీల్ధార్‌గా డిప్యూటీ తహసీల్ధార్ కృష్ణయ్యకు ఇంచార్జీ బాధ్యతలు అప్పగించారు.



## మధ్యాహ్నా భోజన కార్మికుల సమ్మె నోటీస్

**కారేపల్లి నేడు న్యూస్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, మధ్యాహ్నా భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు కోసం ఈనెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గంటున్నట్లు కారేపల్లి మండల మధ్యాహ్నా భోజన వర్కర్లు బుధవారం సమ్మెనోటీస్ ఇచ్చారు. బుధవారం ఎంఈవో జయరాజును కలిసి 9వ తేదిన సమ్మెలో పాల్గంటున్నామని తెలియజేశారు. ఈసందర్భంగా సీఐటీయు మండలకన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లతో కేంద్ర ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించటం లేదన్నారు. కార్మికల హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌ల పేరుతో పని గంటలు పెంచే విధానాలను తీసుకవస్తుందన్నారు. కేంద్ర విధానాలపై కార్మికులు గట్టి వ్యతికతను తెలియజేయటానికి ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్నా భోజన వర్కర్స్ యూనియన్‌నాయకురాలు మంగతాయి, విక్టోరియ, కోటమ్మ పాల్గొన్నారు.



## కమిషనర్ సార్ స్పందించండి

- శిథిలావస్థలో వాటర్ ట్యాంకు.. భయాందోళనలో స్థానికులు
- వాటర్ ట్యాంకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజల డిమాండ్

**మేడ్చల్, నేడు న్యూస్ :** గుండ్లపోచంపల్లి గ్రామానికి గత కోన్నేళ్లుగా త్రాగు నీటిని అందించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డులోని ప్రాథమిక పాఠశాల చేరువలో ఉన్న వాటర్ ట్యాంక్ ను నిర్మించి దాదాపు ఐదు దశాబ్దాలు కావొస్తుంది. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ క్రింది భాగంలో పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు తేలి ప్రమాదం పొంచి ఉంది. గత కొన్ని రోజులుగా వాటర్ ట్యాంక్ పైపెచ్చు ఉడి పడటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎవరిపై పెచ్చులు పడి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఈ వాటర్ ట్యాంక్ నిర్మించి దశాబ్దాలు గడుస్తుండటంతో శిథిలావస్థకు చేరిందన్నారు. గతంలో గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయితీ పాలనలో మరమ్మతులు చేసిన అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. వాటర్ ట్యాంక్ ప్రక్కన ఒకవైపు ప్రాథమిక పాఠశాల మరోవైపు నివాసగృహాలు ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతోందో తెలియకుండా ఉందన్నారు. వర్షాకాలం మొదలు అవ్వడంతో భారీగా వర్షాలు, ఈదురు గాలుల వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటుందని కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరుగక ముందే శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు పురపాలక సంఘం కమిషనర్ ను కోరుతున్నారు.

## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్షపడింది. కోర్టు ధిక్కరణ కేసులో ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ తీర్పు వెలువరించిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమెను అరెస్టు చేసిన లేక లొంగిపోయిన రోజు నుంచి ఈ శిక్ష అమలుకానుంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. ఒక కేసులో ఆమె దోషిగా తేలడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.




## విద్యార్థి వీసాలకూ 'టైం లిమిట్'

### - అమెరికా కొత్త మెలిక..

**యూఎస్ :** అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలపై న్యాయనిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.

### అమెరికా దాడితో

## ఫోర్డోకు భారీ నష్టమే

### అంచనా వేస్తున్నాం : ఇరాన్



**ఇరాన్ :** ఇరాన్‌లోని ఫోర్డో సహా మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్‌లోని అణుస్థావరాలు ఏ మేరకు ధ్వంసమయ్యాయన్న విషయంపై వివాదం చెలరేగుతోంది. దీనిపై తాజాగా ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. అమెరికా బంకర్ బస్టర్ బాంబుల దాడుల్లో తమ అణుకేంద్రాలు ధ్వంసం కావడంతో భారీ నష్టం సంభవించిందనే విషయం వాస్తవమే నన్నారు. అయితే.. ఫోర్డోలో ఏం జరిగిందనే విషయం ఎవరికీ పూర్తిగా తెలియదని పేర్కొన్నారు. దాడి తీవ్రతపై ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు చెందిన అణు ఇంధన సంస్థ అధికారులు ఇంకా అంచనా వేస్తున్నారని తెలిపారు. దర్యాప్తు అనంతరం నష్టంపై పూర్తి వివరాలను వారు ప్రభుత్వానికి వెల్లడి స్తారన్నారు. ఇరాన్‌లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ఫోర్డో, ఇస్ఫహాన్, నతాంజ్ అణుశుద్ధి కేంద్రాలపై తాము భారీ దాడులు చేశామని అమెరికా వెల్లడించింది. అయితే, సంబంధిత అణుకేంద్రాలకు వాటిల్లిన నష్టంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వాటిని ధ్వంసం చేయాలంటే అగ్రరాజ్యం ప్రయోగించిన బాంబుల స్థాయి సరిపోదని చైనా నిపుణులు తెలిపారు. ఇరాన్‌కు పరిమితంగానే నష్టం వాటిల్లిందని ఇంటెలిజెన్స్ నివేదికలను ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ సైతం తమ అణుకేంద్రాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అంగీకరించింది. అయితే పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే ఈ దాడుల్లో ఇరాన్‌కు జరిగిన నష్టం గురించి అధ్యయనం చేసిన పెంటగాన్‌కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) ఓ నివేదికను రూపొందించింది. అందులో అణు కేంద్రాలను పునరుద్ధరించడానికి ఇరాన్‌కు కొన్ని నెలల సమయం చాలని, ఫోర్డో, నతాంజ్‌లు పూర్తిగా నాశనం కాలేదని ఆ నివేదికలో పేర్కొనట్లు సీఎన్ఎన్ పేర్కొంది. సెంట్రిఫ్యూజ్‌లు భద్రంగా ఉన్నాయని, శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా వేరే ప్రాంతాలకు టెహ్రాన్ తరలించిందని డీఐఏ పేర్కొంది.

# భూ సమీకరణకు కొత్త చట్టం

- సరికొత్త నిబంధనలతో రూపకల్పన
- మార్గదర్శకాలకు త్వరలోనే ప్రతిపాదనలు
- విస్తరిత హెచ్‌ఎండీఏ పరిధిలో అమలు



**హైదరాబాద్, నేడు న్యూస్:** భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీమ్)కు మరిన్ని సంస్కరణలను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విస్తరిత హెచ్‌ఎండీఏ పరిధిలో అమలు చేయనుంది. భూ సమీకరణ పథకం-2017తో ఆశించిన ప్రయోజనాలు నెరవేరకపోవడంతో ఆస్థానంలో సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. సరికొత్త నిబంధనలు, మార్గదర్శకాలతో ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) అనే ముసాయిదా చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి ఓ కన్సల్టెన్సీని నియమించేందుకు హెచ్‌ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది.

### పట్టాభూములకే అవకాశం

అభివృద్ధి అనేది ఒకే ప్రాంతానికి పరిమితమవ్వకుండా ఔటర్ అవతల మినీ నగరాలు, టౌన్‌షిపలను తీసుకొచ్చేందుకు అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్-2017 తీసుకువచ్చింది. అయితే దానికి ఆశించిన స్పందన రావడం లేదు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌ను 733 ఎకరాలతో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టగా, అదే తరహాలో స్వరాష్ట్రంలోనూ ఎనిమిదేళ్ల క్రితం తీసుకొచ్చారు. నాటి చట్టం ప్రకారం ఇన్ముల్ నర్వ (95 ఎకరాలు), లేమూరు (84 ఎకరాలు)లో లే అవుట్‌లు అభివృద్ధి చేయగా, ప్రతాప సింగారం (110 ఎకరాలు)లో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఈ స్కీమ్ వచ్చిన ఎనిమిదేళ్లలో మూడు ప్రాంతాల్లో 289 ఎకరాలే సేకరించారు. 2017లో ఉన్న కొన్ని నిబంధనలు ప్రభుత్వానికి, రైతులకు ఇబ్బందికరంగా మారాయి. కేవలం పట్టా భూములకే అవకాశం కల్పించారు. అసైన్డ్, సీలింగ్ భూములు సేకరించే అవకాశం లేదు.

### ఇతర రాష్ట్రాల్లో ఉపయుక్తంగా..

దేశంలోని పలు నగరాల్లోని డెవలప్‌మెంట్ అథారిటీలకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ వరంగా మారింది. ప్రధానంగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్ర ప్రభుత్వాలు ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు నోటిఫికేషన్ వేయగానే రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చి పరిహారంగా మరోచోట అభివృద్ధి చేసిన మరింత భూమిని తీసుకుంటున్నారు. అక్కడి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంకు అందుబాటులోకి వస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు రైతులు, ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండడంతో 2017లో రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను తెలంగాణలో అమలు చేసేందుకు మార్గదర్శకాలతో ఉత్తర్వులిలిచ్చింది. కానీ ఇప్పటి వరకు కేవలం హెచ్‌ఎండీఏ పరిధిలో మినహా రాష్ట్రంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను అమలు చేయలేదు. హెచ్‌ఎండీఏ పరిధిలో కూడా ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు.

### కొత్త నిబంధనలతో చట్టం

రాష్ట్రం మొత్తం కాకుండా విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలోమీటర్లలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు సరికొత్త సంస్కరణలను తీసుకొస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) ముసాయిదా చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. హెచ్‌ఎండీఏ పరిధిలో జాతీయ, రాష్ట్రీయ రహదారులతో పాటు ప్రధాన ప్రాంతాల రహదారుల వెంట ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి తీసుకురావాలని భావిస్తోంది. ఈ చట్టానికి అవసరమైన నియమాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి ఓ కన్సల్టెన్సీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు ఆదేశాలిచ్చింది. విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిని ఆధారంగా చేసుకొని ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ ముసాయిదా చట్టం ఉండాలని, ఈ చట్టానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మార్గదర్శకాలు, నియమాలను జోడించాలని సూచించినట్లు తెలిసింది. ముసాయిదా చట్టానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో కన్సల్టెన్సీ నియామకానికి చర్యలు చేపట్టారు. ఆరు నెలల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టెండర్ నోటిఫికేషన్‌లో నిర్ణయించారు. శివారు ప్రాంతాల్లో ల్యాండ్ బ్యాంక్ పెంచడానికి, టౌన్‌షిపలను తీసుకురావడానికి ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (చట్టం) ఉపయుక్తంగా మారుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## నాంధారీస్ వెజిటేబుల్ సీడ్స్ పరిశ్రమ నిర్వాకం

- బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ పదార్థాలు పారబోత
- చెరువులో వదులుతున్న కెమికల్ వాటర్
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**మేడ్చల్, నేడు న్యూస్ :** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని నూతనకల్ గ్రామ పరిధిలో గల నాంధారీస్ వెజిటేబుల్ సీడ్స్ పరిశ్రమ నిబంధనలకు విరుద్ధంగా తమ పరిశ్రమలో కుళ్ళిపోయిన వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. దీంతోపాటు పరిశ్రమలోని కెమికల్ వాటర్ ను ట్రాక్టర్ ట్యాంకర్ లో తీసుకెళ్లి గ్రామ సమీపంలో ఉన్న నీరు ఎండిపోయిన చెరువులో కలపడం వల్ల చెరువు కలుషితమవుతుందని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన్ కల్ గ్రామంలోని నాంధారీస్ వెజిటేబుల్ సీడ్స్ కంపెనీ సర్టిఫైడ్ ఫామ్స్ నుండి వెజిటేబుల్స్ తెప్పించి వాటిని శుభ్రం చేసి వాటిని కట్ చేసి నగరంలోని ఇంటర్నేషనల్ రెస్టారెంట్లకు సప్లై చేస్తుంటారు. అయితే వెజిటేబుల్స్ నుంచి వచ్చే వేస్టేజ్ ని కవర్లో కట్టి బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీ నుండి వచ్చే వ్యర్థ పదార్థాలను నూతనకల్ గ్రామం నుండి శ్రీరంగవరంకు వెళ్లే దారిలో ఉన్న మైలుకుంటలోని బహిరంగ ప్రదేశంలో పారవేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు



సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వ్యర్థ పదార్థాలు కుళ్ళి దోమలు, ఈగలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు భావిస్తున్నారు. బహిరంగ ప్రదేశాలలో వేసిన ఈ వ్యర్థ పదార్థాలను పశువులు, మేకలు తిని చనిపోయే ప్రమాదం ఉందని, ఇదేవిధంగా కంపెనీలో కూరగాయలు కడిగిన కెమికల్ వాటర్ ను ట్యాంకర్ ద్వారా తీసుకెళ్లి కుంటలో వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థ పదార్థాలు, కెమికల్ నీటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ఆయా కంపెనీ కాంపౌండ్ లోనే వ్యర్థ పదార్థాలను పడేసే సౌకర్యం చేసుకోవాలని కోరుతున్నారు.

### బహిరంగ ప్రదేశంలో వేయడం లేదు : మేనేజర్ యజ్ఞశ్రీ

బహిరంగ ప్రదేశంలో వ్యర్థ పదార్థాలను పడేస్తున్నామని వస్తున్న ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని ఆ కంపెనీ మేనేజర్ యజ్ఞశ్రీ తెలిపారు. వ్యర్థ పదార్థాలను తొలగించే పనులను కాంట్రాక్టర్ కు ఇవ్వడం జరిగిందని, కంపెనీ నుండి వచ్చే వ్యర్థ పదార్థాలను కాంట్రాక్టర్ తీసుకెళ్లి తన సొంత స్థలంలో వేసుకుంటున్నాడన్నారు. ఇందులో మా ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు. అదే విధంగా కెమికల్ వాటర్ కుంట చెరువులో వేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలలో సైతం నిజం లేదని తెలిపారు.



## తిమ్మాపూర్ పిహెచ్ఎన్ఓకి ఘనంగా వీడ్కోలు

- వైద్య వృత్తిలో యశోదమ్మ సేవలు అభినందనీయం
- డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి

**నేడు న్యూస్, దుబ్బాక ప్రతినిధి :** వైద్య వృత్తిలో తిమ్మాపూర్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ యశోద సేవలు అభినందనీయమని, ఆమె చేసిన సేవలు తోటి వారికీ ఆదర్శనీయమని డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ పీహెచ్సీలో తిమ్మాపూర్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పదవి విరమణ సన్మాన సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. 36 ఏళ్ల చేసిన సేవలకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్బంగా వారికీ పలు పీహెచ్సీ అధికారులు, ఫార్మసిస్టులు, అశ్వర్కర్లు శాలువాతో సత్కరించిశుభాకాంక్షలు తెలియజేశారు. తిమ్మాపూర్ పీ హెచ్సీ పరిధిలో పలు గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యం పట్ల చేసిన అవగాహన కార్యక్రమాలు, ప్రజల్లో మంచి మన్ననలు పొందడంతో ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో హెచ్ ఈ సత్యనారాయణ, పోగ్రామ్ ఆఫీసర్లు, తిమ్మాపూర్ వైద్యధికారి ఉదయ్ కుమార్, రామక్కపేట వైద్యధికారి హబిబా, భూంపల్లి వైద్యధికారిహిమబిందు, మిరుదొడ్డి వైద్యధికారి సమీరా సుల్తానా, హాస్పటల్ సిబ్బంది, ఏ ఎన్ ఎం లు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.




## మేడ్చల్ తహసీల్దార్‌గా వి.భూపాల్

**మేడ్చల్, నేడు న్యూస్ :** మేడ్చల్ మండల నూతన తహసీల్దారుగా వి.భూపాల్ ను నియమిస్తూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి నియమిస్తూ గత నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టే వి.భూపాల్ సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

## సారీ.. ఆ ఆయుధాలు ఇవ్వలేం

### ఉక్రెయిన్‌కు అమెరికా షాక్



**వాషింగ్టన్:** రష్యాతో భీకర యుద్ధంలో ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధ సాయం చేస్తోన్న అమెరికా ఇప్పుడు గట్టి షాకిచ్చింది. కీవ్‌కు కొన్ని రకాల ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించింది. తమ సొంత ఆయుధ నిల్వలను సమీక్షించిన అనంతరం అగ్రరాజ్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెంటగాన్ అధికారులు వెల్లడించారు. రష్యా నుంచి దాడులు తీవ్రమవుతున్న వేళ.. ఈ పరిణామం ఉక్రెయిన్ కు గట్టి ఎదురుదెబ్బే..! ఈ ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించడానికి గత బైడెన్ ప్రభుత్వం అంగీకరించింది. అయితే, ఇటీవల తమ ఆయుధ నిల్వలను సమీక్షించిన అమెరికా రక్షణశాఖ.. కీవ్‌కు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయుధాల నిల్వలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించి ఆందోళన వ్యక్తంచేసింది. దీంతో ఉక్రెయిన్‌కు వెళ్లాల్సిన పెండింగ్ షిప్‌మెంట్లను పంపించొద్దని నిర్ణయించినట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు. అయితే, ఆ ఆయుధాలు ఏంటనే వివరాలను రక్షణ శాఖ వెల్లడించలేదు. తమ సొంత అవసరాలు తీరిన తర్వాతే ఇతర దేశాలకు ఆయుధ సాయం చేయాలన్న అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ అధికార ప్రతినిధి అన్నా కేలీ ఓ ప్రకటనలో వెల్లడించారు. 2022 ఫిబ్రవరిలో రష్యాతో పోరు ప్రారంభమైన నాటినుంచి అమెరికా ఇప్పటివరకు కీవ్‌కు 66 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ, సైనిక సాయాన్ని అందజేసింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య గత మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం ఇటీవల మరింత తీవ్రంగా మారుతున్న సంగతి తెలిసిందే. దీర్ఘశ్రేణి డ్రోన్లతో కీవ్‌పై మాస్కో విరుచుకుపడుతోంది. ఈ దాడులను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ కూడా తీవ్రంగానే కష్టపడుతోంది. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చర్చలు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

## పార్లమెంటులో భద్రతా వైఫల్యం ఘటన

### నిందితులకు బెయిల్

**న్యూఢిల్లీ :** పార్లమెంటులో భద్రతా వైఫల్యం కేసులో 2023లో నిందితులుగా ఉన్న నీలమ్, మనోరంజన్, సాగర్‌శర్మ, లలిత్ ఝా, అమోల్ శిందే, మహేశ్ కుమావత్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టైన నీలమ్ ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు బుధవారం దిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. నిందితులు రూ.50,000 చొప్పున బెయిల్ బాండ్, పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. బెయిల్ షరతుల్లో భాగంగా నిందితులు దిల్లీ విడిచి వెళ్లకూడదని, ఈ కేసుకు సంబంధించి ఎటువంటి ఇంటర్వ్యూలు, బహిరంగ ప్రకటనలు చేయవద్దని పేర్కొంది. 2023 పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ డిసెంబరు 13న లోక్‌సభలోకి దుండగులు ప్రవేశించిన ఘటన యావత్ దేశాన్ని షాక్‌కు గురిచేసిన విషయం తెలిసిందే. లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా.. సాగర్‌శర్మ, మనోరంజన్‌లు పబ్లిక్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. పార్లమెంటు లోపల, బయట పసుపు రంగుతో కూడిన పొగ విడుదల చేస్తూ ఎంపీలు, భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. సంచలనం కోసం దుండగులు చేసిన ఈ చర్యతో యావత్ దేశం ఉలిక్కిపడింది.

# తొలి రోజు ముగిసిన ఆట..




## శుభ్‌మన్ గిల్ సెంచరీ.. భారత్ 310/5



**ఎడ్జ్‌బాస్టన్:** ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (114, 216 బంతుల్లో 12 ఫోర్లు) మరోసారి శతకంతో చెలరేగాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (87, 107 బంతుల్లో 13 ఫోర్లు) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్‌కు తోడుగా రవీంద్ర జడేజా (41, 67 బంతుల్లో 5 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. కరుణ్ నాయర్ (31, 50 బంతుల్లో), రిషభ్ పంత్ (25, 42 బంతుల్లో) నిలకడగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. కేఎల్ రాహుల్ (2), నితీశ్ రెడ్డి (1) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 2, బ్రైడన్ కార్స్, బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### రాహుల్ నిరాశపర్చినా.. జైస్వాల్ నిలబడ్డాడు

ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారత్‌కు షాక్ తగిలింది. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో (8.4 ఓవర్) బంతిని డిఫెన్స్ చేయబోయి రాహుల్ బౌల్డయ్యాడు. అప్పటికి భారత్ స్కోరు 15. తర్వాత వచ్చిన కరుణ్ నాయర్ నిలకడగా ఆడాడు. మరోవైపు, ఆరంభంలో ఆచితూచి ఆడిన జైస్వాల్.. క్రమంగా జోరందుకున్నాడు. జోష్ టంగ్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదాడు. టంగ్ 16వ ఓవర్‌లో మూడు బౌండరీలు రాబట్టాడు. తర్వాత అతడి బౌలింగ్‌లోనే హ్యాట్రిక్ ఫోర్లు బాదేసి అర్ధ శతకం (59 బంతుల్లో) అందుకున్నాడు. అయితే, లంచ్ బ్రేక్ ముందు కరుణ్ నాయర్‌ను బ్రైడన్ కార్స్ అద్భుతమైన షార్ట్‌బాల్‌తో బోల్తా కొట్టించాడు. కరుణ్ సెకండ్ స్లిప్‌లో బ్రూక్‌కు క్యాచ్ వెనుదిరిగాడు. దీంతో 80 పరుగుల భాగస్వామ్యానికి (90 బంతుల్లో) తెరపడింది. ఈ క్రమంలో భోజన విరామ సమయానికి భారత్ 98/2తో నిలిచింది.

### స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడ్డా..

భోజన విరామం అనంతరం నిలకడగా ఆడిన జైస్వాల్ సెంచరీ దిశగా సాగాడు. కానీ, 87 పరుగుల వద్ద బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. రెండో సెషన్‌లో భారత్ 28 ఓవర్లు ఆడి 84 పరుగులు చేసి యశస్వి జైస్వాల్ వికెట్‌ను కోల్పోయింది. చివరి సెషన్‌ను భారత్ మెరుగ్గానే ఆరంభించింది. అయితే స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు కోల్పోయి 211/5 స్కోరుతో కష్టాల్లో పడింది. బషీర్ బౌలింగ్‌లో రిషభ్ పంత్ భారీ షాట్ ఆడి జాక్ క్రాలీకి చిక్కాడు. తర్వాత వచ్చిన నితీశ్ రెడ్డిని క్రిస్ వోక్స్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన జడేజా.. గిల్‌కు చక్కటి సహకారం అందించాడు. వీరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి జట్టును ఆదుకున్నారు. జో రూట్ బౌలింగ్‌లో గిల్ వరుసగా రెండు ఫోర్లు బాది సెంచరీ (199 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. గిల్, జడేజా జోడీ అభేద్యమైన ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం (142 బంతుల్లో) నెలకొల్పింది. ఈ ద్వయం రెండో రోజు కూడా ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని పరుగులు రాబడితే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించే అవకాశముంది.



## కొత్త ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను లాంచ్ చేసిన టీవీఎస్

ప్రముఖ ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ రూ.1.03 లక్షల ధరకు (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) మెరుగైన ఫీచర్లతో కూడిన ఎలక్ట్రిక్ స్కూటర్ ఐక్యూబ్‌ను ప్రవేశపెట్టిందని కంపెనీ ఈ రోజు(బుధవారం) తెలిపింది. ఈ కొత్త వేరియంట్..హిల్ హోల్డ్ అసిస్ట్, 3.1 బ్యాటరీ వంటి ఫీచర్లను కలిగి ఉంటుంది. ఇది ఒకే ఛార్జ్‌పై 123 కి.మీ మైలేజ్‌ను అందిస్తుంది. టీవీఎస్ మోటార్..6 లక్షలకు పైగా ఐక్యూబ్ యూనిట్ల అమ్మకాలను ఇప్పటికే నమోదు చేసింది. టీవీఎస్, ఈ కొత్త వేరియంట్ ఐక్యూబ్‌ను ప్రతిరోజు ప్రయాణించడానికి అనుకూలంగా రూపొందించింది. ఒకే ఛార్జ్‌పై సర్టిఫైడ్ 123 కి.మీ. రేంజ్ అందిస్తుంది. డ్యూయల్ టోన్ కలర్స్, బ్యాక్‌రెస్ట్ వంటి డిజైన్ అప్‌గ్రేడ్‌లతో వాహనాన్ని ఆధునీకరించామని కంపెనీ తెలిపింది.





## రూ.12,500 కోట్ల మెగా ఐపీఓ..

### 13శాతం ప్రీమియంతో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ లిస్టింగ్

**ముంబయి:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ బుధవారం స్టాక్ మార్కెట్లలోకి ఎంట్రీ ఇచ్చింది. దాదాపు 13 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది. ఇష్యూ ధర రూ.740తో పోలిస్తే ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేరు 12.84 శాతం లాభంతో రూ.835 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. బీఎస్ఈలోనూ ఇదే ప్రీమియంతో నమోదయ్యింది. అనంతరం ఈ షేర్లు ఫ్లాట్‌గా కొనసాగుతున్నాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రూ.12,500 కోట్ల మెగా ఐపీఓకు విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ఐపీఓలో భాగంగా 13 కోట్ల షేర్లు (13,04,42,855) విక్రయానికి ఉంచగా.. 217 కోట్ల షేర్లకు (2,17,67,62,140) బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల కోటా అత్యధికంగా 55.47 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ కాగా.. సంస్థాగతేతర మదుపర్ల కేటగిరీలో 9.99 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంతపెద్ద ఐపీఓ ఓవర్ సబ్‌స్క్రైబ్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంతపెద్ద ఐపీఓ ఓవర్ సబ్‌స్క్రైబ్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.3,369 కోట్లను హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సమీకరించింది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.36% వాటా ఉంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులతో కంపెనీ తమ టైర్-1 క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేసుకోనుంది. భవిష్యత్ వ్యాపార వృద్ధికి కొంత మొత్తాన్ని వినియోగించనుంది. సంభవ్ స్టీల్ ట్యూబ్స్ కూడా 34 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది. ఐపీఓ లిస్టింగ్ ప్రైస్ రూ.82 కాగా.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.110 వద్ద ఎంట్రీ ఇచ్చింది. రూ.540 కోట్ల ఈ ఐపీఓలో రూ.440 కోట్లు తాజా షేర్లు జారీ చేయగా.. రూ.100 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించారు.

## నష్టాల్లో ముగిసిన సూచీలు

### 25,500 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా విధించిన టారిఫ్ డెడ్‌లైన్ జులై 9 సమీపిస్తున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు ఒత్తిడి సూచీలపై కనిపించింది. దీంతో సూచీలు ఆరంభ లాభాలను కోల్పోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,790.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,697.29) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,935.01 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకుంది. చివరికి 287 పాయింట్ల నష్టంతో 83,409.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.40 పాయింట్ల నష్టంతో 25,453.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.68గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటి జాబితాలో ఉన్నాయి. టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.70 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3352 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మిడిల్‌క్లాస్‌కు త్వరలో మరో ఊరట

### ఈ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు?




ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు అమాంతం పెంచి మధ్యతరగతికి ఊరట కల్పించిన కేంద్రం మరో గుడ్‌న్యూస్ చెప్పేందుకు సిద్ధమవుతోంది. మధ్య తరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని చూస్తోంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా 12 శాతంలో ఉన్న చాలావరకు వస్తువుల ను 5 శాతం ట్యాక్స్ శ్లాబ్ పరిధిలోకి తీసుకురావడమో చేయాలని కేంద్రం చూస్తోంది. తద్వారా వారిపై భారం తగ్గించాలని భావిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. పేద, మధ్యతరగతి ఎక్కువగా వినియోగించే టూత్‌పేస్టు, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంటగదిలో వినియోగించే పాత్రలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషిన్లు, సైకిళ్లు, రూ.1000 పైబడిన రెడీమేడ్ దుస్తులు, ఫుట్‌వేర్, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గించాలని భావిస్తున్న వస్తువుల జాబితాలో ఉన్నాయి. ప్రతిపాదిత వస్తువులపై జీఎస్టీ తగ్గిస్తే అవి తక్కువ ధరకే పేద, మధ్యతరగతి వర్గాలకు లభిస్తాయి. కేంద్రం తీసుకోబోయే ఈ నిర్ణయం వల్ల ఖజానాపై రూ.40వేల నుంచి రూ.50వేల కోట్ల వరకు భారం పడుతుందని అంచనా. అయితే, ఆయా ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడం ద్వారా వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. పన్ను పరిధి పెరగడంతో పాటు దీర్ఘకాలంలో జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దిగువ, మధ్య తరగతికి ఊరట కల్పించే దిశగా జీఎస్టీ రేట్లు హేతుబద్ధీకరించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడం గమనార్హం. ఈ నిర్ణయాలు తీసుకోవాలంటే జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం సాధించాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులో జీఎస్టీ మండలి సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మళ్లీ వార్తల్లో జెఫ్ బెజోస్..

### రూ.6 వేల కోట్ల విలువైన షేర్ల విక్రయం



ప్రపంచ కుబేరుల్లో ఒకరు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఆయన.. తాజాగా అమెజాన్‌లో తన షేర్లలో కొంత మొత్తాన్ని విక్రయించారు. 736.7 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.6300 కోట్ల పైమాటే) విలువైన 33 లక్షల షేర్లను అమ్మేశారు. అయినప్పటికీ 241.4 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచ కుబేరుల జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ ఏడాదిలో బెజోస్ తన షేర్లను విక్రయించడం ఇదే తొలిసారి. ఎప్పటిలాగే తన ట్రేడింగ్ ప్రణాళికల్లో భాగంగా ఈ ఏడాది 25 మిలియన్ల షేర్లను విక్రయించాలని అమెజాన్ అధిపతి నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఈ ఏడాది మార్చిలో వెల్లడించారు. అప్పటినుంచి కంపెనీ షేరు విలువ దాదాపు 8 శాతానికి పైగా పెరగడం గమనార్హం. గతేడాది కూడా బెజోస్ తన ట్రేడింగ్ ప్రణాళికల కింద 13.6 బిలియన్ డాలర్ల విలువైన 75 మిలియన్ల షేర్లు విక్రయించారు. 2002 నుంచి ఏటా ఇలా తన వాటాలో కొంత మొత్తాన్ని బెజోస్ అమ్మేస్తూ వస్తున్నారు. అలా ఇప్పటివరకు 44 బిలియన్ డాలర్ల షేర్లను విక్రయించారు. వీటి ద్వారా వచ్చిన నిధులను తన అంతరిక్ష సంస్థ బ్లూ ఆర్జిన్ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు. మరోవైపు, దాతృత్వ కార్యక్రమాల కోసం కూడా షేర్లను అమ్మేస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో 9,30,000 షేర్లు స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చేశారు. 61 ఏళ్ల జెఫ్ బెజోస్ గత వారమే తన ప్రియురాలు లారెన్ శాంచెజ్‌ను పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇటలీలోని వెనిస్ వేదికగా జరిగిన ఈ వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరి పెళ్లి ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి.

## రద్దీ ఉంటే రేట్లు పెంచుకోవచ్చు

### క్యాబ్ సంస్థలకు కేంద్రం పచ్చజెండా




యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్, ఓలా వంటి సంస్థలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రద్దీ ఉంటే రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈమేరకు మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం నామమాత్రంగా రద్దీ ఉన్న సమయాల్లో బేస్ ఛార్జీల్లో సగం సర్‌ఛార్జీ కింద పెంచుకునేందుకు వీలు కల్పించింది. అలాగే ఒకవేళ రద్దీ విపరీతంగా ఉంటే 200 శాతం పెంచుకునేందుకు అనుమతిచ్చింది. అంతకుముందు ఈ వెలుసుబాటు 150 శాతంగా ఉండేది. ఇక, మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదన్న షరతు విధించింది. యాప్ ద్వారా రైడ్‌ను అంగీకరించిన తర్వాత సరైన కారణం చెప్పకుండా డ్రైవర్ క్యాన్సిల్ చేస్తే.. ఛార్జీలో 10 శాతం పెనాల్టీ (రూ.100 మించకుండా) పడుతుంది. దానిని డ్రైవర్, అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ (ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలు) చెరి సమానంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ, సరైన కారణం చెప్పకుండా ప్రయాణికులు రైడ్ క్యాన్సిల్ చేసినా ఇదే పెనాల్టీ వర్తిస్తుంది. అలాగే కేంద్రం డ్రైవర్ల సంక్షేమంపై ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లతో అనుబంధంగా ఉన్న ప్రతి డ్రైవర్‌కు కనీసం రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల మేర టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజ్‌ను ఆ క్యాబ్ సంస్థలు తప్పనిసరిగా అందించాలని పేర్కొంది. అలాగే ఈ వేదికల ద్వారా ప్యాసింజర్ రైడ్స్ కోసం ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి అనుమతించింది. ఇటీవల కర్ణాటక వ్యాప్తంగా బైక్ ట్యాక్సీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటూ కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా.. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. దాంతో వాటి సేవలు నిలిచిపోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్‌వర్కర్ల జీవితాలు రోడ్డునపడతాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఆటోలు, బైక్ ట్యాక్సీలు, సహా ఇతర వాహనాలకు బేస్ ఛార్జీలను నిర్ణయించే అధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందించింది. ఒకవేళ రాష్ట్రాలు బేస్ ఛార్జీలను అధికారికంగా నోటిఫై చేయకపోతే.. ఆ ధరలను ప్రకటించే బాధ్యత అగ్రిగేటర్లదేనని వెల్లడించింది. అలాగే ఆ వివరాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని చెప్పింది. ఇక డ్రైవర్ పికప్‌పాయింట్‌కు చేరుకోవడానికి ప్రయాణించే దూరం అంటే డెడ్ మైలేజ్‌కు ఛార్జీ విధించకూడదని మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే పికప్ పాయింట్ మూడు కిలోమీటర్ల కంటే తక్కువ దూరం ఉన్నప్పుడే ఈ మినహాయింపు వర్తిస్తుంది. అలాగే ప్రయాణికుల భద్రతను నిర్ధరించేందుకు ఈ క్యాబ్ సంస్థల కింద సేవలు అందించే వాహనాలకు వెహికిల్ లొకేషన్, ట్రాకింగ్ పరికరాలు అమర్చడాన్ని తప్పనిసరి చేసింది. ఈ డేటా ఫీడ్.. ఆ సంస్థలతో పాటు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లకు అందుబాటులో ఉండాలి. దాంతో అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు వీలు కలుగుతుందని పేర్కొంది.

## ఆధార్ ఉంటేనే పాన్




**హైదరాబాద్:** కొత్తగా పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) తీసుకోవాలని అనుకుంటున్నారా.. మీకు ఆధార్ ఉంటేనే ఇది సాధ్యం అవుతుంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు పాన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు, ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణలో ఏదో ఒకటి సమర్పిస్తే సరిపోయేది. ఇక నుంచి తప్పనిసరిగా ఆధార్ సంఖ్య ఉండాల్సిందే. ఇప్పటికే పాన్ ఉన్నవారు కచ్చితంగా దాన్ని ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి. లేకపోతే పాన్ రద్దవుతుంది. చెల్లని పాన్‌తో ఏవైనా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నిస్తే, జరిమానా విధిస్తారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com